కడియంలో చిరుత సంచారం



కడియంలో లభ్యమైన చిరుత పాదముద్రలు

ధ్రువీకరించిన అటవీశాఖ సిబ్బంది

కడియం, న్యూస్‌టుడే: గత మూడు రోజులుగా జాడ లేని చిరుత పులి ఆచూకీ కడియం మండలం కడియపులంక పరిధి దోశాలమ్మకాలనీలో లభించింది. ఆ మేరకు ఈ ప్రాంతంలో లభించిన పాద ముద్రలను మంగళవారం రాత్రి అటవీశాఖ అధికారులు చిరుతవిగా ధ్రువీకరించారు. కడియపులంక గ్రామానికి చెందిన మధు అనే నర్సరీ రైతు తన పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న తరుణంలో చిరుతను చూసినట్లు తెలిపారు.. దాంతో ఆ ప్రదేశంలోని పాద ముద్రలను పరిశీలించిన డీఎఫ్‌వో భరణి అవి చిరుతవిగా నిర్ధారించారు. స్థానిక పోలీసులతోపాటు రెవెన్యూ పంచాయతీ అధికారులను అప్రమత్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో చిరుత సంచారం వివరాలను వివరించి ప్రజల్ని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కడియపులంక సర్పంచి పాటంశెట్టి రాంజీ, నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు నర్సరీ కార్మికులకు బుధవారం సెలవు ప్రకటించారు. రాత్రి వేళ బయటకు రావద్దని హితవు పలికారు. ప్రస్తుతం చిరుత సంచారం గోదావరి నది వైపుగా (ఆలమూరు, మడికి గ్రామాలు మీదుగా) ఉన్నట్లు అధికారులు తెలిపారు. సంచార సమాచారం తెలిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు అందించాలని కోరారు.

పదవులతో జోష్

7 కార్పొరేషన్లలో 14 మందికి చోటు

ఈనాడు, కాకినాడ– న్యూస్‌టుడే, కంబాలచెరువు, టి.నగర్, ధవళేశ్వరం: ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడిన తెదేపా- జనసేన- భాజపా నేతలకు కూటమి ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. రాజకీయ, సామాజిక సమీకరణాల తూకంతో 7 కార్పొరేషన్లలో 14 మందికి ఉమ్మడి జిల్లా నుంచి నామినేటెడ్ పదవుల్లో అవకాశమిచ్చింది.




■ కార్పొరేషన్ల సభ్యులుగా..

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన గంటా స్వరూపాదేవిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. జనసేన ఆవిర్భావం నుంచి ఆమె పార్టీలో చురుగ్గా ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ● ఏపీ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యునిగా యర్రా వేణుగోపాలరాయుడు నియమితులయ్యారు. ప్రస్తుతం తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు. అంతకుముందు శాప్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ● ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యునిగా వాసిరెడ్డి రాంబాబు నియమితులయ్యారు. గతంలో పార్టీ నగర అధ్యక్షునిగా పదేళ్లపాటు పనిచేశారు. వరుసగా మూడేళ్లు కార్పొరేటర్‌గా గెలుపొందగా నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా కొనసాగారు.



గంటా స్వరూపాదేవి



యర్రా వేణుగోపాలరాయుడు



వాసిరెడ్డి రాంబాబు

పౌరసరఫరాలు గాడిన పడేనా..

◆ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ ఛైర్మన్‌గా కాకినాడ సిటీ నియోజకవర్గానికి చెందిన జనసేన నేత తోట మెహర్ సీతారామ సుధీర్ నియమితులయ్యారు. సభ్యులుగా కాకినాడ సిటీ జనసేన నాయకురాలు కడలి ఈశ్వరి, ముమ్మిడివరం తెదేపా నేత మోకా ఆనంద్ సాగర్, పెద్దాపురం నియోజకవర్గ భాజపా నేత తుమ్మల పద్మజలను నియమించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల వ్యవస్థను గాడిలో పెడతానని ప్రకటించడం.. కాకినాడ కేంద్రంగా సాగుతున్న రేషన్ మాఫియాకు కళ్లెం వేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఛైర్మన్‌తో సహా ఉమ్మడి జిల్లా నుంచి నలుగురికి ఈ కార్పొరేషన్‌లో అవకాశం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ◆ పేదల బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటామని సుధీర్ అన్నారు. ధాన్యం సేకరణ పటిష్ఠంగా చేపట్టి కనీస మద్దతు ధర అందేలా కృషి చేస్తానన్నారు.



పవన్‌తో సుధీర్

పద్మశాలి కార్పొరేషన్‌లో సభ్యులుగా నలుగురికి అవకాశం

ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి సంస్థ సభ్యుడిగా రాజమహేంద్రవరం గ్రామీణ నియోజకవర్గ తెదేపా నాయకుడు మత్తేటి శివసత్యప్రసాద్ నియమితులయ్యారు. 1990లో తెదేపాలో చేరి అప్పటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్నారు. రాజమహేంద్రవరం గ్రామీణ మండలం తెలుగు యువత అధ్యక్షుడిగా, 1997లో బొమ్మూరు గ్రామ సర్పంచిగా పనిచేశారు. 2002లో కడియం నియోజకవర్గం సమన్వయకర్తగా నియమితులయ్యారు. 2021 నుంచి రాజమహేంద్రవరం గ్రామీణ మండల తెదేపా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు అలానే ఇదే కార్పొరేషన్ సభ్యునిగా రాజమహేంద్రవరానికి చెందిన తంగెళ్ల బాబి(హరికిశోర్) నియమితులయ్యారు. 2014 మున్సిపల్ ఎన్నికల్లో 36వ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి గెలుపొందారు. అంతకుముందు తెలుగు యువత నాయకునిగా ఉన్నారు. ◆ పిఠాపురం నియోజకవర్గం నుంచి తెదేపా నేత బేతా సత్యనారాయణ, జనసేన నేత సూరిశెట్టి జయనాగ కృష్ణలకు అవకాశం దక్కింది.



శివసత్యప్రసాద్



తంగెళ్ల బాబి(హరికిశోర్)



యు.కొత్తపల్లిలో నిర్మాణ దశలో ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ విద్యా సంస్థ భవనం

పుష్కరమైంది.. పలుకుతారా!

▮ వైకాపా నేతల నిర్వాకంతో కేంద్ర విద్యా సంస్థపై నీలినీడలు

▮ గుత్తేదారుకు బిల్లులు ఇవ్వక ఆగిన పనులు

ఈనాడు, కాకినాడ

వందల మంది విద్యార్థులకు వివిధ కోర్సులతో స్వయం ఉపాధి చూపాల్సిన సంస్థ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం)... కాకినాడ జిల్లాకు కేటాయించిన ఈ విద్యాసంస్థపై కేంద్రం కరుణించినా .. అక్కడి స్థలంలో రాజకీయం వేలు పెట్టడంతో కొన్నాళ్లు పడకేసింది. అడ్డంకులు తొలగాక పనులు చేస్తున్న గుత్తేదారుకు వైకాపా సర్కారు బిల్లులు ఆపేయడంతో నీలి నీడలు కమ్మేశాయి.

వీడని చిక్కుముళ్లు..

యు.కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పక్కనే అయిదెకరాల ఖాళీ స్థలంలో తెదేపా ప్రభుత్వం 2014లో శంకుస్థాపన చేసింది. రూ. 1.50 కోట్లు ఖర్చుచేసి పనులు ప్రారంభించాక పిల్లల ఆట స్థలంలో నిర్మాణాలేమిటని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వైకాపా నాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తేవడంతో పనులు ఆగాయి. వైకాపా ప్రభుత్వం వచ్చాక చిక్కులు తొలగించుకున్నా.. ప్రాజెక్టు కొలిక్కిరాలేదు. చేసిన పనులకు రూ.2 కోట్ల బిల్లులు ఇవ్వలేదని గుత్తేదారు ఆపేశారు.

నైపుణ్య వికాసానికి గ్రహణం..

జాతీయ విద్యా ప్రవేశ నిబంధనలు అనుసరించి కౌన్సిల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్-క్యాటరింగ్ టెక్నాలజీ సంయుక్తంగా ప్రవేశ పరీక్షల ద్వారా కోర్సులకు అవకాశం కల్పించాలి. విద్యాసంస్థ పూర్తయితే మూడేళ్ల బీఎస్సీ డిగ్రీ.. ఆహార ఉత్పత్తి, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీసు, హౌస్ కీపింగ్, ఆఫీస్ ఆపరేషన్స్‌లలో ఏడాదిన్నర వ్యవధితో ట్రేడ్ డిప్లమో కోర్సులూ వస్తాయి. డిగ్రీ కోర్సుకు 80 సీట్లు. . డిప్లమో కోర్సులకు 40 చొప్పున 280 సీట్ల భర్తీ చేయొచ్చు. తిరుపతిలో నిర్మాణం పూర్తయి నడుస్తుంటే.. మనవద్ద పుష్కర కాలంగా ఎదురుచూపులే.

సంస్థ: స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం)
అంచనా వ్యయం రూ.12 కోట్లు
పథకం మంజూరు 07.01.2013
నిర్మాణం పూర్తికి గడువు: 07.01.2016
పనుల ప్రగతి: తరగతి గదులు, పాలన భవనాలు కొలిక్కిరాలేదు. విద్యార్థుల వసతిగృహ నిర్మాణం పునాది స్థాయిలో ఉంది. మౌలిక వసతులు లేవు.

కూటమి ప్రభుత్వం ఊతమిస్తేనే..

హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నిర్మాణానికి కేంద్రం మంజూరుచేసిన నిధుల్లో.. తరగతుల నిర్వహణ, పరిపాలన భవనాలకు రూ.8 కోట్లు.. వసతిగృహ సముదాయానికి రూ.2 కోట్లు.. బోధన సామగ్రి, ఇతర వనరులకు రూ.2 కోట్ల చొప్పున వెచ్చించాలి. ఇప్పటివరకు చేసిన పనులకు రూ.4 కోట్లు మంజూరైతే.. మరో రూ.2 కోట్లు బిల్లులు రావాలి. గోడలు, ప్లాస్టరింగ్, ఫ్లోర్, విద్యుత్తు వైరింగ్ ఆగిపోయాయి. భవన నిర్మాణాలు పూర్తయ్యాక రోడ్లు, మురుగు పారుదల వ్యవస్థ, చుట్టూ వీధి దీపాలు సమకూర్చాలి. వైకాపా ప్రభుత్వం గత అయిదేళ్లలో శ్రద్ధ చూపలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిధుల విడుదలకు చొరవచూపి విద్యాసంస్థను అందుబాటులోకి తేవాలన్న ఆకాంక్ష వ్యక్తమవుతోంది.



పునాది దశ దాటని విద్యార్థుల వసతి భవన ప్రాంగణం

నినదించిన గళం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: డిమాండ్ల సాధనకు ఈ నెల 27న యూనియన్ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా మంగళవారం రాజమహేంద్రవరంలో ధర్నా నిర్వహించారు. ఇన్నీసుపేట యూబీఐ ప్రాంతీయ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కొత్తగా నియామకాలు చేపట్టాలని.. తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్. లక్ష్మీపతిరావు, రామకృష్ణ, స్వామి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



ఆడేద్దాం.. ఒత్తిడి అధిగమిద్దాం

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ఏపీ విద్యుత్తు శాఖ ఉద్యోగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యుత్తుశాఖ ఎస్ఈ కె.తిలక్ మాట్లాడుతూ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఇటువంటి క్రీడలు దోహదపడతాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నవంబరులో తిరుపతిలో జరిగే ఆలిండియా స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర క్రీడాసంఘ జనరల్ సెక్రటరీ శామ్యూల్, ఉపాధ్యక్షుడు శ్రీధర్‌వర్మ, కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రరావు, సంఘ క్రీడల కార్యదర్శి బలిజ వాసు పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న విద్యుత్తు శాఖ ఉద్యోగులు

రూ.కోట్ల వ్యయం.. నిష్ప్రయోజనం

వైకాపా హయాంలో ‘స్వచ్ఛ’ దోపిడీ

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

గత వైకాపా ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్ మిషన్ పేరిట రూ.కోట్లు దుర్వినియోగం చేశారు. గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించారు. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసే పరిస్థితికి తీసుకొచ్చారు. నాసిరకం పరికరాలు, యంత్రాలు కొనుగోలు చేసి గ్రామ పంచాయతీలకు సరఫరా చేశారు. అవి కొద్ది రోజులకే మరమ్మతులకు గురై మూలకు చేరి తుప్పుపట్టాయి.

గ్రామాల్లోని జనాభా, సేకరించే చెత్త ఆధారంగా ట్రైసైకిళ్లు, ఈ-ఆటోలు, డీజిల్ వ్యాన్‌లు, ట్రాక్టర్లు, దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు, గడ్డి, పనికిరాని మొక్కల తొలగింపునకు కట్టర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు ముక్కలుగా చేసి ముద్దచేసే యంత్రాలు, ఇన్సిరేటర్లు, అధిక పీడనంతో పనిచేసే టాయిలెట్ క్లీనర్లు వంటివి అప్పటి వైకాపా ప్రభుత్వం 2020-23 సంవత్సరాల మధ్య పెద్దఎత్తున స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసింది. దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ ఖర్చు చేసింది. ఆయా గ్రామ పంచాయతీలు పెట్టిన ప్రతిపాదనల మేరకు వాటిని దశలవారీగా అందించింది. దీనిలో భాగంగా జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో మొత్తం 1,670 సరఫరా కాగా వాటిని అవసరత మేరకు ఆయా గ్రామ పంచాయతీలకు అందజేశారు. వీటిలో చాలావరకు గత రెండేళ్లుగా నిరుపయోగంగానే మిగిలాయి.

ఇదీ పరిస్థితి

రాజమహేంద్రవరం డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లోని 147 పంచాయతీలకు, కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లోని 153 పంచాయతీలకు యంత్రాలు సరఫరా చేశారు. వీటిలో ట్రైసైకిళ్లు 738, ఫాగింగ్ యంత్రాలు 186, ఇన్సిరేటర్లు, 237, కట్టర్లు 36, టాయిలెట్ క్లీనర్లు 204, మిస్ట్ బ్లోయర్లు 34, ఈ-ఆటోలు 72, డీజిల్ వ్యాన్‌లు 43, ట్రాక్టర్లు 156 ఉన్నాయి. ఫాగింగ్ యంత్రాలు, గడ్డి, పనికిరాని మొక్కలు తొలగించే కట్టర్లు, ఇతర పరికరాలను అసలు వినియోగించకుండానే కొన్నిచోట్ల మూలకు చేరాయి. మరికొన్నిచోట్ల వినియోగించే విధానం తెలిసిన సిబ్బంది లేకపోవడం వల్ల నిరుపయోగంగా మారాయి. వీటి ఒక్కొక్క దానికి రూ.1.50 లక్షల నుంచి 2.లక్షల వరకు వెచ్చించింది. నాసిరకం కొనుగోలు చేసి నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు అప్పట్లో వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కొన్ని మరమ్మతులు చేయడానికి కూడా వీలులేని పరిస్థితిలో, మరికొన్ని మరమ్మతులు చేసినా ఉపయోగపడని స్థితిలో ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం దృష్టి

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో దోమల వ్యాప్తి చెందకుండా, ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మూలన పడిన పారిశుద్ధ్య పరికరాలు, యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు యోచిస్తున్నారు. గత ప్రభుత్వం కొనుగోలు చేసి అందించిన ఫాగింగ్ యంత్రాలు, ఇతర పారిశుద్ధ్య పరికరాలు కొన్ని పనిచేయడం లేదని చెబుతున్నారు.



పంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా మిగిలిన ఫాగింగ్ యంత్రం, కట్టర్



పరుగుపందెంలో విద్యార్థినులు

దేశ అంతర్గత రక్షణకు దిక్సూచి.. ఎన్ఎస్ఎస్

నన్నయ విశ్వవిద్యాలయం (రాజానగరం), న్యూస్‌టుడే: త్రివిధ దళాలు భారతదేశ సరిహద్దుల్లో రక్షణ కవచంలా ఉంటే.. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వంటివి దేశ అంతర్గత రక్షణకు దిక్సూచిగా నిలుస్తున్నాయని నన్నయ వీసీ శ్రీనివాసరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రి రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి 155 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు హాజరయ్యారు. ఈ ఎంపికలలో విద్యార్థులు ప్రతిభ కనబరచి వచ్చే ఏడాది దిల్లీలో జరిగే రిపబ్లిక్ డే కార్యక్రమంలో పాల్గొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్ఎస్ఎస్ స్టేట్ యూత్ ఆఫీసర్ ఎం. సైదా మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హైదరాబాద్‌లో నిర్వహించే ప్రీ ఆర్డీ క్యాంప్‌నకు ఎంపిక చేస్తామన్నారు. అనంతరం వీసీ వర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.30 వేల చెక్కును వీసీకి అందజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. పి. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పౌరసరఫరాల అధికారిగా ప్రసాద్

రాజమహేంద్రవరం కలెక్టరేట్: జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్‌వో)గా జె.వి.ఎస్.ఎం.ప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. కర్నూలులో పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి రానున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించిన విజయ్‌భాస్కర్ రంపచోడవరానికి బదిలీ అయ్యారు. కొత్త డీఎస్‌వో బాధ్యతలు చేపట్టేవరకు రాజమహేంద్రవరం ఏఎస్‌వో నాగాంజనేయులుకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు.

ప్రసాదం కల్తీ చేసిన వారిని దైవం వదలదు: మంత్రి దుర్గేష్

పెరవలి, న్యూస్‌టుడే: హిందువుల ఆరాధ్య దైవం వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని కల్తీ చేసిన వారిని కలియుగ దైవం వదలదని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇటువంటి అపవిత్రమైన పనికి పాల్పడటం దురదృష్టకరమన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు కార్యక్రమాల్లో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపావళికి మహిళలకు మూడు సిలిండర్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రాధాన్యాల ఆధారంగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించారు.

సాంకేతికతో మంచి దిగుబడి: సాంకేతికతతో రైతులు ఎక్కువ దిగుబడి సాధించేలా ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కాకరపర్రులో డ్రోన్‌తో పిచికారీ, వ్యవసాయ పరికరాలను పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, పెన్మత్స సుబ్రహ్మణ్య వర్మ, రంగినీడి గంగాధరరావు, అతికాల వెంకటరామకృష్ణమ్మ, పిప్పర రవి, గుబ్బల ఆదిలక్ష్మి, గుడాల రంగారావు, భూపతిరాజు రవివర్మ, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



డ్రోన్‌తో పిచికారీ పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, శేషారావు, తదితరులు



తిరుమలలో జరిగిన అపచారంపై ఆందోళన

తిరుమలలో స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో జరిగిన అపచారాన్ని ఖండిస్తూ రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద నిరసన ర్యాలీ చేశారు. మంగళవారం హిందూచైతన్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సభ్యులు మాట్లాడుతూ స్వామివారి ప్రసాదం తయారీలో కల్తీనెయ్యి వినియోగించడం అత్యంత బాధాకరమన్నారు. దేవాలయం పూర్వవైభవానికి అవసరమైన చర్యలు యుద్ధప్రాతిపదికన తీసుకోవాలని నినాదాలు చేశారు. వై.కె.శ్రీనివాస్, పట్నాల సూరిబాబు, రిషి పాల్గొన్నారు.

\- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

అంతా గందరగోళం!

న్యూస్‌టుడే, సీతానగరం, గోకవరం

వైకాపా ప్రభుత్వం 2022లో జిల్లాలను పునర్విభజన చేసిందే తప్ప ప్రధాన శాఖలకు రెగ్యులర్ ఎస్ఈ స్థాయి అధికారులు లేక పాలనాపరమైన అంశాలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రధానంగా రూ.కోట్లతో ప్రజలకు అత్యవసరమైన తాగునీరు అందించే ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఉన్న దిగువస్థాయి అధికారులకే అదనపు బాధ్యతలు అప్పగించి చేతులు దులిపేసుకున్నారు. దీంతో తాగునీటి పథకాల పర్యవేక్షణ, జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో ఇంటింటా కొళాయి తదితర పనులన్నీ నీరుగారుతున్నాయి.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఎస్ఈ స్థాయి అధికారులు లేక అస్తవ్యస్తం



రాజమహేంద్రవరంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం

✦ డీఆర్ఈవో పేరుకే..

జిల్లాల విభజనంలో ఆర్‌డబ్ల్యూఎస్‌కు ఎస్ఈ స్థాయి అధికారి ఇప్పటికి కాకినాడకు మాత్రమే ఉన్నారు. ఈఈ స్థాయి అధికారులకు డీఆర్ఈవో హోదా కల్పిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు అప్పట్లోనే వైకాపా నియమించింది. వీరికి ఎటువంటి హోదా, నిధులు లేకుండానే అటు ఈఈ, ఇటు డీఆర్ఈవోగా బాధ్యతల్లో ఉన్నారు. తాగునీటి పథకాలపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నా డీఆర్ఈవోగా ఎటువంటి అధికారం లేకుండా ఉత్సవ విగ్రహాల్లా ఉండిపోయారు. పనులు చేసి బిల్లులు పెడితే ఏఈ, డీఈ, ఈఈ, ఎస్ఈ స్థాయిలోనే సంతకాలు ఉంటున్నాయే తప్ప డీఆర్ఈవో ప్రమేయం లేకుండా పోయింది. ఇప్పటివరకు వీరికి రబ్బరు స్టాంప్ కూడా లేదు.

జిల్లాలో పథకాల వివరాలిలా..	
సీపీడబ్ల్యూఎస్	06
పీడబ్ల్యూఎస్	644
ఎంపీడబ్ల్యూఎస్	277
డీపీఎస్	40
చేతిపంపులు	2,234

✦ సబ్‌డివిజన్ అనపర్తి.. ఉండేది లాలాచెరువు

పునర్విభజన చేసిన సమయంలోనే ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు అనపర్తి సబ్‌డివిజన్‌గా విడదీసి రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలను తీసుకెళ్లి అందులో కలిపారు. దీంతో ఏ పనిచేసుకోవాలన్నా 70 కిలోమీటర్లు పైగా అనపర్తి చేరే పరిస్థితులు ఉన్నాయి. దీంతో రాజమహేంద్రవరం సమీపంలోని లాలాచెరువు వద్ద అద్దె ఇల్లు తీసుకుని సబ్‌డివిజన్ కార్యాలయం(అనపర్తి) పేరుతో ఉంచారు. అవసరమైన ఉద్యోగులు ఆ శాఖకు లేకపోవడమే కాకుండా పునర్విభజన అంతా గందరగోళంగా మారింది. ఏడుగురు డీఈలకు గాను ముగ్గురు, 22 మంది ఏఈలకు గాను 17 మంది పనిచేస్తున్నారు. ఇక చేతిపంపులు మరమ్మతులు చేసేందుకు మండలానికి ఒకరు చొప్పున మెకానిక్‌లు పనిచేయాలి. ఒకే ఒక్క మెకానిక్ మాత్రమే మొత్తం జిల్లా అంతా పనిచేస్తున్నారు.

28, 29 తేదీల్లో న్యాయవాదుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ స్పోర్ట్స్, కల్చరల్ సెక్రెటరీ కాశీ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం కాస్మోపాలిటన్, బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఇవి జరుగుతాయన్నారు. ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత హాజరై పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు, జిల్లా న్యాయవాదులు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

29న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలు

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక 29న ఉదయం 9 గంటలకు రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ముప్పన వీరభద్రస్వామి, కార్యదర్శి ఓలేటి సీతాపతిరావు తెలిపారు. 1 జనవరి 2005 తర్వాత పుట్టిన బాలబాలికలు అర్హులన్నారు. పుట్టిన తేదీ ధ్రువపత్రం నకలు, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. డ్రెస్ కోడ్ తప్పనిసరని చెప్పారు. వచ్చే నెల 5 నుంచి 7 వరకు విశాఖ జిల్లా నునపర్తిలో జరగబోయే రాష్ట్ర స్థాయి అంతర జిల్లా జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలబాలికల జట్లు పాల్గొంటాయని తెలిపారు.

అండర్-14 ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు వాయిదా

మసీదు సెంటర్ (కాకినాడ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం కాకినాడ డీఎస్ఏలో నిర్వహించాల్సిన అండర్-14 ఫుట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపికలు వాయిదా వేశారు. వర్షం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి జార్జి తెలిపారు.

13,677 మందికి ఓటు హక్కు

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ముసాయిదా జాబితా ప్రచురణ ● నమోదుకు మళ్లీ అవకాశం

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాను మంగళవారం ప్రకటించారు. ఆ జాబితాను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్ విడుదల చేశారు. జులై 29 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 14,191 మంది దరఖాస్తు చేయగా, వివరాలు సక్రమంగా ఉన్న 13,677 మందికి ఓటు హక్కు కల్పించారు. ఇందులో 8,062 మంది పురుషులు, 5,613 మంది మహిళలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు.



కాకినాడ కలెక్టరేట్‌లో ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తులను సమర్పిస్తున్న రెవెన్యూ అధికారులు (దాచిన చిత్రం)

ఆరు జిల్లాల పరిధి..

ముసాయిదా జాబితాను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించారు. ఈ నియోజకవర్గ పరిధిలో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామ రాజు జిల్లాలు ఉన్నాయి.

అక్టోబరు 15 వరకు..: మంగళవారం నుంచి అక్టోబరు 15 వరకు ఓటు నమోదుకు మళ్లీ అవకాశం కల్పించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అభ్యంతరాల స్వీకరణ

ముసాయిదా జాబితాపై వచ్చిన అభ్యంతరాలను అక్టోబరు 30లోగా పరిష్కరిస్తారు. తుది ఓటర్ల జాబితాను నవంబరు 6న ప్రచురించనున్నారు. అనంతరం ఈ నియోజకవర్గ ఎన్నికలకు ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. మరింత సమాచారం, సహాయం కోసం 1950 టోల్‌ఫ్రీ నంబరు, కాకినాడ కలెక్టరేట్‌లోని ఈఆర్వో కార్యాలయంలో సంప్రదించవచ్చు.

ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలివీ..

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు
కాకినాడ	1,723	1,279	1
తూర్పుగోదావరి	1,288	1,080	0
అంబేడ్కర్ కోనసీమ	1,745	889	0
అల్లూరి సీతారామరాజు	288	191	0
ఏలూరు	1,264	1,010	0
పశ్చిమగోదావరి	1,754	1,164	1

న్యాయవ్యవస్థపై నిబద్ధత ఉన్న నాయకుడు చంద్రబాబు

భారత న్యాయవాదుల సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల



దానవాయిపేట (రాజమహేంద్రవరం): వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా ఎన్నికల హామీలు అమలుకు చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, భారత న్యాయవాదుల సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు రాష్ట్ర న్యాయవాదులందరి తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబుకు న్యాయవ్యవస్థ, న్యాయవాదుల సంక్షేమం పట్ల ఉన్న నిబద్ధత ఇటీవల ఆయన తీసుకున్న నిర్ణయాలలో నిరూపితమైందన్నారు. న్యాయశాఖ సమీక్షలో పలు అంశాలపై సమీక్ష జరిపి అంతర్జాతీయ న్యాయ కళాశాల, కర్నూలులో హైకోర్టు బెంచ్, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేలు స్టయిపండ్ ఇచ్చేలా అవసరమైన ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించడం అభినందనీయమన్నారు. అకాడమీ ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయం చాలా మంచిదన్నారు. పునర్విభజన చట్టంలోని సెక్షన్-30లో ప్రధాన న్యాయస్థానంతో పాటు హైకోర్టు బెంచ్ నిర్మాణం చేయవచ్చనే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తుచేశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఇవ్వడం ఇష్టంలేని మాజీ సీఎం జగన్ ఏకంగా హైకోర్టునే ఆ ప్రాంతానికి తరలిస్తామని అబద్ధపు ప్రచారం చేశారని విమర్శించారు.

పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధుల వినతి

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: పౌల్ట్రీ రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ కోరింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోమటిపల్లి వెంకటసుబ్బారావు (బాబ్జీ) మంగళవారం ఈ వివరాలు తెలిపారు. ఎంపీ పురందేశ్వరి, తెదేపా నాయకుడు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యంతో కలిసి దిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి, పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల వివరించామన్నారు. పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశామన్నారు. ప్రతినిధులు గోడితి గంగాధర్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు, చిత్రంలో ఎంపీ పురందేశ్వరి

సబ్‌రిజిస్ట్రార్ల బదిలీ

వి.ఎల్.పురం: రాజమహేంద్రవరం అర్బన్, పిడింగొయ్యి సబ్‌రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 ఎం.రాజబాబు నిడదవోలు సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీకాగా ఆయన స్థానంలో ఇక్కడికి ముమ్మిడివరం నుంచి ఆర్.రాంబాబు రానున్నారు. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2 కుమారస్వామి అనపర్తి బదిలీకాగా ఆ స్థానంలో ఏలూరు జిల్లా నుంచి పుల్లంరాజు రానున్నారు. పిడింగొయ్యి సబ్‌రిజిస్ట్రార్ కె.సుందరరావు కొవ్వూరు బదిలీ కాగా ఆయన స్థానంలో ఇక్కడికి కృష్ణాజిల్లా నుంచి త్రినాథ్ రానున్నారు.

ఆర్టీసీలో ముగ్గురు..: జిల్లా ఆర్టీసీలో ముగ్గురు అధికారులు బదిలీ అయ్యారు. నిడదవోలు డిపో మేనేజర్ శ్రీరామ్‌కుమార్ మైదుకూరు డిపోనకు బదిలీకాగా ఆయన స్థానంలో రామచంద్రపురం డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లును నియమించారు. రాజమహేంద్రవరం డీపీటీవో కార్యాలయ సూపరింటెండెంట్ కె.సత్యనారాయణ విశాఖపట్నం-1 డిపోనకు బదిలీ అయ్యారు. ఇక్కడి డిపో గ్యారేజీలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ ఈశ్వరరావు సింహాచలం బదిలీ కాగా ఆయన స్థానంలో రావులపాలెం డిపోలోని కె.నాగలక్ష్మిని నియమించారు.

తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందనడానికి ఆధారం ఏంటి..?: హర్షకుమార్

టీనగర్: తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందనడానికి ఆధారం ఏంటని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ప్రశ్నించారు. మంగళవారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాలుగా కల్తీ జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపిస్తున్నారని.. అదే జరిగితే అప్పటి ఆధారాలు చూపించాల్సి ఉందన్నారు. మాజీ సీఎం జగన్ లడ్డూ కల్తీ విషయంలో సీబీఐ విచారణ కోరితే చంద్రబాబు మాత్రం సిట్ వేయమని చెప్పడంలో అర్థం లేదన్నారు. సింహాచలం, అన్నవరం ఆలయాలకు ఇదే కంపెనీ నెయ్యి సరఫరా చేస్తుండగా ధరల్లో వ్యత్యాసం ఉందని, తిరుపతికి రూ.350కే ఇవ్వడంపై విచారణ జరపాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేకపోతున్నారన్నారు. దళిత పథకాలన్నీ పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చి ముఖం చాటేస్తున్నారన్నారు. విశాఖలో 25 వేల కేజీల డ్రగ్స్ దొరికితే మాట్లాడటం లేదన్నారు. భాజపాను గెలిపించేందుకు పవన్‌కల్యాణ్ కంకణం కట్టుకొన్నారన్నారు. ఉండిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు సరికాదన్నారు. కొవ్వూరులో దళితులపై దాడి విషయంలో ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్నారు.

స్వర్ణకిరీటానికి ఘనంగా గ్రామోత్సవం



గోకవరం, న్యూస్‌టుడే: దేవీచౌక్ దుర్గాదేవి అమ్మవారికి రూ.21 లక్షలతో చేయించిన స్వర్ణ కిరీటానికి మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు, పద్మావతి దంపతులు ఆలయంలో పూజలు నిర్వహించి అమ్మవారి కిరీటాన్ని శిరస్సుపై ఎత్తుకొని ప్రధాన రహదారి మీదుగా గ్రామోత్సవం జరిపారు. భక్తులు అమ్మవారి కిరీటానికి హారతులిచ్చారు.

ఖరీఫ్ వరకే ఉచిత బీమా..!

రబీ నుంచి ప్రీమియం చెల్లింపులో రైతుల భాగస్వామ్యం

న్యూస్‌టుడే, సీతానగరం

ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వివిధ పంటలకు ఉచిత బీమా వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి, అపరాలు, అరటి పంటలకు వాతావరణ ఆధారిత ఉచిత పంటల బీమా వర్తింపజేశారు. ఈ-పంట ఆధారంగా 4.25 లక్షల ఎకరాల్లో వరి, 28,450 ఎకరాల్లో అపరాలు, 35 వేల ఎకరాల్లో అరటి సుమారుగా 5.25 లక్షల మంది రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేస్తారు. ఆరుగాలం శ్రమించి రైతులు పండిస్తున్న పంటలు ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల బారినపడి నష్టపోతున్నారు. గత అయిదేళ్లలో పెట్టుబడులు పెట్టి పంటలు చేతికొచ్చే సమయంలో అనేక విపత్తుల కారణంగా నష్టపోయారు. కూటమి ప్రభుత్వం ఉచిత బీమా వర్తింపజేయడంతో మేలు జరుగుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బీమా అనేది ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే పరిమితం చేసింది.

రబీలో ఇలా..

రబీ సీజన్‌కు వచ్చేసరికి పంటలపై బీమా వర్తింపునకు నిర్దేశించిన ప్రీమియం మొత్తాన్ని రైతులు చెల్లించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. ఈ-పంట నమోదుతోపాటు బ్యాంకుల నుంచి రుణం తీసుకునే రైతులు బ్యాంకులోనే అవసరమైన ప్రీమియం చెల్లించాలి. రుణాలు తీసుకోని వారంతా కామన్ సర్వీస్ సెంటర్లలో డీడీ తీసి సంబంధిత బీమా సంస్థ కార్యాలయానికి పంపాలి. వరి, మినుము, పెసర తదితర అపరాలకు 3 శాతం, మొక్కజొన్నకు 6 శాతం ప్రీమియం చెల్లించాలి.



రామచంద్రపురంలో వరి పంట

అవగాహన కల్పిస్తున్నాం..

ఉచిత పంటల బీమా అమలును ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పర్యవేక్షిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఖరీఫ్‌లో ప్రతి రైతుకు ఉచిత పంటల బీమా అందేలా వ్యవసాయ సహాయకులతో గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. రబీలో ఏయే పంటలకు ఎంత ప్రీమియం చెల్లించాలనే విషయాలను వివరిస్తున్నాం. పంటల బీమాలో ప్రీమియం ద్వారా రైతులను భాగస్వాములను చేస్తాం.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి

ట్రయల్ రన్‌లోనే పరిశ్రమ

బహిరంగ సమావేశానికి గ్రామస్థుల డిమాండ్

గోకవరం, న్యూస్‌టుడే: అస్సాగో ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులు మంగళవారం సాయంత్రం గుమ్మళ్లదొడ్డిలో స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రమణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులు హాజరై పరిశ్రమ పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదని ఇంకా ట్రయల్‌రన్ నడుస్తుందని చెప్పారు. పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభమైనప్పటికి ఏవిధమైన ఇబ్బందులు తలెత్తవని హామీ ఇచ్చారు. అయితే సమావేశం జరుగుతుందన్న విషయం తెలియడంతో గుమ్మళ్లదొడ్డితో పాటు సమీప గ్రామాలు బావాజీపేట, వెదురుపాక, అచ్యుతాపురం నుంచి పెద్దఎత్తున యువకులు తరలివచ్చారు. కార్యాలయంలో సమావేశం నిర్వహించడం వలన ఉపయోగం లేదని బయటకు వచ్చి బహిరంగ సమావేశం నిర్వహించాలంటూ వీరు పట్టుబట్టారు. గత కొన్ని రోజులుగా పరిశ్రమ నుంచి దుర్వాసన రావడంతో పాటు రాత్రి సమయాల్లో పెద్దఎత్తున శబ్దాలు రావడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ ఆందోళనకు దిగారు. అదే సమయంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో సమావేశం రసాభాసగా మారింది. దీంతో సంస్థ ప్రతినిధులు సమావేశం పూర్తి కాకుండానే అక్కడ నుంచి నిష్క్రమించారు.



ఇథనాల్ పరిశ్రమ ప్రతినిధులు, స్థానిక నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి రమణకుమారి

గోష్పాద క్షేత్రంలో సౌకర్యాలు కల్పిస్తాం

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి క్షేత్రంలో పర్యటించారు. వరద నేపథ్యంలో రేవు, మెట్లపై చేరిన ఒండ్రు మట్టి, బురదను తొలగించాలని, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులను అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. వదిలివేసిన రావి చెట్టు కొమ్మలను తరలించి ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించాలన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, సూరపనేని చిన్ని, పురపాలక మేనేజరు పి.సాయిబాబా తదితరులున్నారు.

● మండలంలోని వేములూరు, తోగుమ్మి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం -100 రోజుల ఎన్డీయే పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, దాయన రామకృష్ణ, ఇమ్మణి ప్రసాద్, అక్కిన రాంబాబు, మజ్జి శేఖర్‌బాబు, మద్దిపాటి సత్యనారాయణ, తోరం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మింగేసిన మృత్యువు

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల దుర్మరణం



సీతారామరాజు



రాజేష్

ఆలమూరు, న్యూస్‌టుడే: తండ్రి చనిపోవడంతో తల్లికి ఆసరాగా నిలిచినవారు ఒకరైతే.. భార్య, ముద్దులొలికే ఇద్దరు చిన్నారులతో హాయిగా జీవితాన్ని సాగించే వ్యక్తి మరొకరు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు ఇంకొకరు.. ఈ ముగ్గురూ మంగళవారం రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం చెందడంతో ఆయా కుటుంబాల్లో చీకట్లు అలముకున్నాయి. ఆలమూరు మండలంలోని చొప్పెల్ల గ్రామానికి చెందిన వానపల్లి రాజేష్ (30), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన వేగిరాజు సీతారామరాజు(36) వెల్డింగ్ పనుల నిమిత్తం రావులపాలెం వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై తమ స్వగ్రామాలకు వెళ్తున్నారు. మంగళవారం సాయంత్రం జొన్నాడ ఏటిగట్టుకు వచ్చేసరికి అదే మార్గంలో మత్స్యకారుల వాహనం కపిలేశ్వరపురం వైపు మలుపు తిరుగుతోంది. ఇది గమనించని వీరు ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి బలంగా ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఒకరైన రాజేష్ ఇటుకబట్టీ నిర్వహిస్తున్నారు. తండ్రి చనిపోగా తల్లికి అతనే ఆధారం. ఇంకా వివాహం కాలేదు. మరో మృతుడు సీతారామరాజుకు భార్య, ఆరోతరగతి చదువుతున్న కుమారుడు, నాలుగోతరగతి చదివే కుమార్తె ఉన్నారు. తండ్రి డయాలసిస్ రోగి కావడంతో కుటుంబ బాధ్యత సీతారామరాజు చూసుకుంటున్నాడు. ఇప్పుడు కుటుంబానికి దిక్కెవరంటూ వారంతా రోదిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.అశోక్ తెలిపారు.

నిబంధనలు పాటించాలి

ఉండ్రాజవరం: బాణసంచా తయారీలో నిబంధనలు పాటించాలని జేసీ చిన్నరాముడు సూచించారు. మండలంలోని సూర్యారావుపాలెంలో బాణసంచా తయారీ కేంద్రాన్ని బృందంగా ఆయన మంగళవారం పరిశీలించారు. నిర్వాహకులకు తగు సూచనలు చేసి, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉండ్రాజవరంలో రైతుభరోసా కేంద్రాన్ని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

యువకుడిపై పోక్సో కేసు

ద్వారపూడి: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు మండపేట రూరల్ ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. మండపేట మండలం ద్వారపూడికి చెందిన బాలిక రాజమహేంద్రవరంలో జూనియర్ ఇంటర్ చదువుతోందని, రోజూ కళాశాలకు వెళ్తున్న క్రమంలో రాజానగరం మండలం తుంగపాడుకు చెందిన యువకుడు సతీష్ ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడన్నారు. సోమవారం ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లి అత్యాచారం చేసినట్లు బాలిక తన తల్లి దండ్రులకు తెలపగా, మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. సతీష్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ పీతల దొరరాజు తెలిపారు.

అమెరికా నుంచి వచ్చిన రాఘవ మృతదేహం

పెరవలి: మండలంలోని కానూరుకు చెందిన చిలుకూరి శ్రీరాఘవ దొర(24) అమెరికాలోని టెక్సాస్‌లో గుండెపోటుతో మృతిచెందిన సంగతి తెలిసిందే. తండ్రి చిన్నప్పుడే మృతిచెందగా తల్లి పుట్టింట్లో ఉంటున్నారు. సోదరుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా వెళ్లిన శ్రీరాఘవ ఎమ్మెస్సీ చదివి, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా మృత్యువాతపడ్డారు. అతని మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరింది. చేతికి అందొచ్చిన బిడ్డ దూరమవ్వడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, నాయకులు నివాళి అర్పించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	10,000
పాతకాయ: గండేరా	16,500
గటగట	13,500
కొత్తకాయ: గండేరా	13,000
గటగట	10,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,000
కిలో	200

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	121-00
రిటైల్ లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

గోదావరిలో దూకి భీమవరం వాసి గల్లంతు

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు -రాజమహేంద్రవరం మధ్య రోడ్‌కం రైలు వంతెనపై నుంచి గోదావరిలో దూకి ఒకరు గల్లంతైన ఘటన కలకలం రేపింది. మంగళవారం సాయంత్రం అందరూ చూస్తుండగా ఓ వ్యక్తి వంతెనపై 127వ స్తంభం వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపి నదిలో దూకేశారు. సమాచారంతో పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాష్ సిబ్బందితో అక్కడికి వెళ్లారు. బండిపై భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చిత్రం, జై గ్రంధి.. సిద్ధం అని రాసి ఉంది. వాహన సంఖ్య ఆధారంగా భీమవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. బండి ఆధారంగా భీమవరం పట్టణానికి చెందిన ఓ వ్యక్తిగా గుర్తించారు. కాగా ప్రస్తుతం ఆ వాహనం అతని దగ్గర కాకుండా వేరే వాళ్ల దగ్గర ఉంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో గల్లంతైన వ్యక్తిపై స్పష్టత రాలేదు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. దీనిపై కేసు నమోదైంది.

మృతదేహం ఆచూకీ లభ్యం

కొవ్వూరు పట్టణం: కొవ్వూరు గోష్పాద క్షేత్రం పిండ ప్రధానాల రేవులో లభ్యమైన వృద్ధుడి మృతదేహం ఆచూకీ తెలిసింది. ఈనెల 22న (ఆదివారం) గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. దీనిపై కేసు నమోదు చేశారు. అది ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన శీలంశెట్టి సత్యాజీరావు (74)గా గుర్తించారు. ఈనెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. 23న జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్లో అదృశ్యం కేసు నమోదు చేశారు. అది సత్యాజీరావు మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారని ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

రాజమహేంద్రవరం

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)



దేవీచౌక్: టమాటా: 34, 30, వంకాయలు(నలుపు/గులాబీ/తెలుపు/పొడవు): 34, 36, 34, 46, బెండ: 20, కాకర: 38, బీర: 32, 28, దొండ: 30, 26, క్యారెట్: 30, బీట్‌రూట్: 30, గోరు చిక్కుళ్లు: 38, దోస: 32, ఆనపకాయ: 20, 22, చిక్కుళ్లు: 58, 88, పచ్చిమిర్చి: 20, బంగాళదుంపలు: 32, ఉల్లిపాయలు: 50, 40.

సినిమాలు: దానవాయిపేట: శ్యామల: 35 చిన్న కథ కాదు, సూర్యమినీ: ట్రాన్స్‌ఫార్మర్స్-1, శివజ్యోతి, అనుశ్రీ, రాజా, వీఎస్ మహల్: మత్తువదలరా-2, అశోక: గొర్రె పురాణం, కుమారి: డిమోంటీ కాలనీ, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్(రెండేసి ఆటలు), సూర్యప్యాలస్: శివాజీ, స్వామి, అప్సర: సరిపోదా శనివారం, రంభ: హైడ్ అండ్ సీక్, కళింగ(రెండేసి ఆటలు), మేనక: జర్నీ, చిక్లెట్స్(రెండేసి ఆటలు), ఊర్వశి: 100 క్రోర్స్, కమిటీ కుర్రోళ్లు(రెండేసి ఆటలు).

తహసీల్దార్లు, డీటీలకు పోస్టింగ్

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాకు కేటాయించిన, బదిలీ జరిగిన పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల(డీటీ)కు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీచేశారు. ఐయిదుగురు తహసీల్దార్లు, 38 డీటీలకు జిల్లాలో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మంగళవారం ఆమె తెలిపారు. వీరితోపాటు 26 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఎల్‌డీ సీనియర్ అసిస్టెంట్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్‌ఐ)లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. కలెక్టరేట్ పరిపాలనాధికారిగా ఎం.డి.మక్బూల్ అలీని నియమించగా కొవ్వూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక తహసీల్దారుగా సి.హెచ్.విద్యావతి, రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దారుగా పి.హెచ్.ఆర్.పాపారావు, రాజమహేంద్రవరం గ్రామీణ తహసీల్దారుగా సి.హెచ్.శ్రీనివాసరావు, కొవ్వూరు తహసీల్దారుగా ఎం.దుర్గాప్రసాద్ నియమితులయ్యారు.


✦ రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయంలో ఇనాం డిప్యూటీ తహసీల్దారుగా ఎం.అఖిల, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ కార్యాలయ ప్రత్యేక డీటీగా ఎం.కార్తిక్, డీసీఎస్‌వో కార్యాలయ డీటీగా జి.డి.మల్లేశ్వరి, రాజమహేంద్రవరం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్(ఎల్‌ఏ) కార్యాలయ ప్రత్యేక డీటీలుగా టి.వి.ఎస్.ఎ.శశిధర్, ఎం.కృష్ణసుధీర్, డీసీఎస్‌వో కార్యాలయ సీఎస్‌డీటీలుగా బి.వి.కె.శాస్త్రి, జె.ఎస్.లక్ష్మి, రాజమహేంద్రవరం గ్రామీణంలోని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు పీపీ కార్యాలయ ప్రత్యేక డీటీగా ఎన్.వి.జె.శేఖర్, రాజమహేంద్రవరం గ్రామీణం డీటీగా ఎస్.సుబ్బారావు, ఎన్నికల డీటీగా కె.చైతన్యబాబు, రాజానగరం డీటీగా కె.సుశాంత్, ఎన్నికల డీటీగా ఎ.కుమారి, రంగంపేట డీటీగా యు.రంజిత్‌కుమార్, సీతానగరం డీటీగా ఎం.సునీత, రీసర్వే డీటీగా పి.సర్వేశ్వరమూర్తి, గోకవరం డీటీగా ఎం.వి.సాయిప్రసాద్, రీసర్వే డీటీగా వి.రత్నసాగర్, కోరుకొండ డీటీగా డి.సాయిరామ్, రీసర్వే డీటీగా ఎ.రజని, కడియం డీటీగా జి.మహాలక్ష్మి, రీసర్వే డీటీగా ఎం.సునీల్‌కుమార్, అనపర్తి డీటీగా ఎన్.వి.వి.సత్యనారాయణ, రాజమహేంద్రవరం అర్బన్ డీటీగా వి.శ్రీనివాసరావులు నియమితులయ్యారు.

నాణ్యతలో రాజీ..

రైతుబజార్లలో నాసిరకం ఉల్లి విక్రయాలు

– న్యూస్‌టుడే, దేవీచౌక్

ఉల్లి ధరలు పెరుగుదలను వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ధర ఎక్కువ పెట్టినా నాణ్యమైన సరకు లభించడం లేదు. రాజమహేంద్రవరం రైతుబజార్లలో కేజీ కొత్తవి రూ.40, పాతవి రూ.50.. ఇలా రెండు రకాల ధరలను నిర్ణయిస్తున్నప్పటికీ ఒకే రకం అందుబాటులో ఉంటోంది. పాతవి కేజీ రూ.50 పెట్టి కొన్నా నాణ్యత ఉండటం లేదు. దీంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. మహారాష్ట్రలో ఉల్లి దిగుబడి చివరి దశకు రావడంతో నెల రోజుల క్రితం కేజీ రూ.50 చేరుకుంది. ఇక అప్పటి నుంచి అదే ధర కొనసాగుతోంది.



రైతుబజార్లలో విక్రయిస్తున్న నాసిరకం ఉల్లిపాయలు

రెండురోజుల నుంచి మరీ నాసిరకం ఉల్లిని విక్రయిస్తున్నారు. తొక్కలు లేనివి, చిన్నవి, కొంచెం నాణ్యతగా ఉన్నవాటిలో కలిపి విక్రయిస్తున్నారు. వారంరోజుల క్రితమే కర్నూలు రకం అందుబాటులోకి వచ్చినప్పటికీ వినియోగదారులు వాటిని కొనుగోలు చేయరనే సాకుతో రైతుబజార్లలో అందుబాటులో ఉంచడం లేదు. రైతుబజార్లలో విక్రయించే పాతరకం ఉల్లి టోకు మార్కెట్‌లో కేజీ రూ.40 నుంచి రూ.45 ఉండగా, కొత్తవి రూ.30 నుంచి రూ.35 వరకు ఉన్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. వీటిపై రూ.5 నుంచి రూ.10 వరకు మార్జిన్ వేసుకుని విక్రయిస్తున్నారు. రవాణా చార్జీలు, ఇతర ఖర్చులు తీసివేసి రూ.3 నుంచి రూ.5 మార్జిన్ తీసుకోవాల్సి ఉండగా రైతుబజార్లలోని కొంతమంది వ్యాపారులు రూ.10 మార్జిన్ తీసుకుంటున్నారు. ఈ విషయంలో ఎస్టేట్ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

మరింత పెరగడంతో..

ప్రసుతం ధర మరింత పెరగడంతో మంగళవారం అన్ని రైతుబజార్లలో కర్నూలు రకం అందుబాటులో ఉంచారు. మహారాష్ట్ర రకం బహిరంగ మార్కెట్లో కేజీ రూ.60 నుంచి రూ.70 వరకు ఉంది. కర్నూలు రకం కూడా అందుబాటులోకి రావడంతో మరో 15 రోజుల్లో ధరలు తగ్గుముఖం పడతాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. మహారాష్ట్రలో కొత్త పంట అందుబాటులోకి వచ్చినా కేంద్రం ఎగుమతులకు అనుమతి ఇవ్వడం వల్లే ధరలు ఇంకా స్థిరంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

నెల రోజుల నుంచి..

రైతుబజార్లలో ఉల్లి ధరలు గత నెల రోజుల నుంచి కేజీ రూ.50 వద్ద స్థిరంగా ఉన్నాయి. ఈ నెల 4న కేజీ రూ.47 ఉన్న ధర రెండు రోజుల తర్వాత రూ.50 చేరుకుంది. ఇక అప్పటి నుంచి అదే కొనసాగుతోంది. గత ఏడాది ఇదే రోజున కేజీ ధర రూ.28 ఉండటం గమనార్హం. నగరంలో మొత్తం ఎనిమిది రైతుబజార్లు ఉండగా ధర తక్కువగా ఉన్నప్పుడు ఆల్కాట్‌తోట, మార్కెట్‌యార్డు మినహా మిగతా వాటికి రోజుకు ఒక్కో బజారుకు రెండు నుంచి మూడు టన్నులు అవసరమవుతాయి. ప్రస్తుతం ధర ఎక్కువగా ఉండటంతో అమ్మకాలు కూడా తగ్గాయి. గతంలో రెండు కేజీలు కొనుగోలు చేసే వినియోగదారులు దానిలో సగం మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో వ్యాపారులు సైతం తక్కువ మొత్తంలోనే దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఒక్కో రైతుబజారుకు 15 నుంచి 20 క్వింటాళ్లు సరిపోతున్నాయని అధికారులు చెబుతున్నారు.

కళాశాలల కబుర్లు



కరాటే పోటీల్లో ప్రతిభ

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 22న కాకినాడ పీఆర్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి ఆహ్వానిత ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి.విజయ్, బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని వి.వెంకట కిరణ్మయి ప్రథమ స్థానాన్ని సాధించారు. వీరిని ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు అభినందించారు.

ఆరోగ్యంపై సదస్సు

రోటరీక్లబ్ రాజమహేంద్రవరం రివర్‌సిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఆరోగ్యమైన గుండె, ఆరోగ్యమైన మనస్సు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యులు ఎ.శివప్రసాద్ గుండె సంబంధిత వ్యాధులను ముందుగా ఎలా గుర్తించాలి, ఎలా ఆరోగ్యంగా ఉంచుకోవాలి తదితర అంశాల గురించి వివరించారు. నాళం నరసింహారావు, కొనకం చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై అతిథి ఉపన్యాసం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో పదజాల నిర్మాణం అనే అంశంపై అతిథి ఉపన్యాసం జరిగింది. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు వై.స్వర్ణశ్రీ భాషలో పదజాలం ప్రాముఖ్యత తదితర అంశాల గురించి వివరించారు.

భాజపా సభ్యత్వ నమోదు

దేవీచౌక్, న్యూస్‌టుడే: కోటగుమ్మం వద్ద భాజపా సీనియర్ నాయకుడు క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మెయిన్‌రోడ్డులో ప్రతి దుకాణానికి వెళ్లి సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా అక్షయ రెసిడెన్సీ అధినేత నూల శివ భాజపాలో చేరారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ అధ్యక్షుడు జవ్వార్, భాజపా నాయకులు హీరా జైన్, ఎన్‌ఎస్‌ఎస్ చంద్రశేఖర్, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు

టి.నగర్, న్యూస్‌టుడే: కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం జరిగిన తెదేపా నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరి కష్టంలో సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించామన్నారు. అదే ఉత్సాహంలో జాంపేట, ఆర్యాపురం బ్యాంకుల్లో తెదేపా జెండా ఎగుర వేయగలిగామన్నారు. ఛాంబర్ ఎన్నికల్లో కూడా గెలుస్తామన్నారు. కొంతమంది రాజకీయ పునరావాస కేంద్రంగా పార్టీని వినియోగించుకొంటున్నారన్నారు. తిరుపతి లడ్డూ విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ పార్టీలో 40 ఏళ్లపాటు ఫలాపేక్ష లేకుండా పనిచేశానన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాయుడు గణేష్, ఆయన మిత్రబృందం, 7వ డివిజన్‌కు చెందిన నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి తదితరులు పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆర్యాపురం బ్యాంకు ఛైర్మన్ చల్లా శంకర్రావు, నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, కాశీ నవీన్‌కుమార్, జాంపేట బ్యాంకు ఛైర్మన్ బొమ్మన జయకుమార్, కుడిపూడి సత్తిబాబు, వర్రే శ్రీనివాసరావు, నక్కా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఏవీఏ రోడ్డు: తుమ్మలావ నటరాజ్-జయరామ్ థియేటర్ వద్ద 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభ అనంతరం ఐ.సి.డి.ఎస్. రాజమండ్రి ప్రాజెక్టు ఆనందనగర్ సెక్టార్ 34, 35, 36, 39 వార్డులకు చెందిన చిన్నరులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మున్సిపల్ ఎ.డి.సి. సత్యవేణి చేతుల మీదుగా అన్నప్రాసన జరిగింది.



పుష్కరఘాట్‌లో శుభ్రం చేస్తున్న రాజ్యలక్ష్మి కళాశాల విద్యార్థులు



ఎస్‌కేవీటీ ప్రిన్సిపల్ రాజబాబును సత్కరిస్తున్న అధ్యాపకులు

స్వచ్ఛ సేవలో సాగుతాం..

రాజమహేంద్రవరం సాంస్కృతికం, దేవీచౌక్, న్యూస్‌టుడే: ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం సందర్భంగా నగరంలోని పలు కళాశాలల వాలంటీర్లు మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు పుష్కరఘాట్‌లో గోదావరిమాత విగ్రహం, బాబాల సమాధి మందిరం, నంది మండపం, ఘాట్‌లోని మెట్లను శుభ్రం చేశారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సభలో కళాశాల డైరెక్టర్ ఎస్.పి.గంగిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి జి.వి.ఎస్.నాగేశ్వరరావు పాల్గొనానరు. ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఎబెల్ రాజబాబును సత్కరించారు.

✦ సమాజ సేవతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు వెల్లడించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉత్తమ వాలంటీర్లు, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ బి.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో మోసం

ఏవీఏ రోడ్డు: ఆన్‌లైన్ ఉద్యోగం పేరుతో 'ఐఏఎస్' సంస్థ నిరుద్యోగులను మోసం చేసిందని నగరానికి చెందిన పలువురు యువకులు వాపోయారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాధితులు చింతపల్లి గౌతమ్, మణికంఠ, గోపి, సాయి తదితరులు తమ గోడు వెల్లబుచ్చారు. యాప్‌లో రూ.18,300 చెల్లించి టాస్క్ పూర్తిచేస్తే రోజుకు రూ.630 చెల్లిస్తామని తెలిపారని, నమ్మి డబ్బులు చెల్లించామన్నారు. సదరు సంస్థ పేరిట అనేక సేవా కార్యక్రమాలు సైతం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధిని ఆహ్వానించామని, ఆయనకు సంస్థకు ఎటువంటి సంబంధం లేదన్నారు. దీనిపై కొందరు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం సంస్థ బోర్డు తిప్పేసిందన్నారు. ఆన్‌లైన్ ఉద్యోగాలపై యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

రాజమహేంద్రవరం నేరవార్తలు: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించిన ఘటన రాజమహేంద్రవరం మూడో పట్టణ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ అప్పారావు తెలిపిన వివరాల మేరకు.. కొంతమూరుకి చెందిన చింతలపూడి నూకరత్నం వై.జంక్షన్ వద్ద ఉన్న విద్యుత్తు ఉపకేంద్రంలో అటెండెర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం విధులు ముగించుకుని జయకృష్ణాపురం మీదుగా బిజిలీ ఐస్‌ఫ్యాక్టరీ రోడ్డువైపు వెళ్తున్న తరుణంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీకొని గాయాలు

గణేష్‌నగర్‌కి చెందిన ఎం.సుబ్బారాయుడు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ద్విచక్రవాహనంపై ఆల్కాట్‌తోట గోదావరి గట్టుపై వెళ్తున్న సమయంలో ఓ ట్రాలీఆటో ఢీకొంది. తలకు గాయం కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన సమాచారంతో రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

వాహనం అదుపుతప్పి..

కొంతమూరు ప్రాంతానికి చెందిన ఎన్.రాజేంద్ర కోరుకొండ రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తరుణంలో వాహనం అదుపుతప్పి రోడ్డు విభాగినిని ఢీకొన్నాడు. ఆ క్రమంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాలు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సారా విక్రేత అరెస్టు

తాడితోట వీరభద్రనగర్ ప్రాంతానికి చెందిన వి.జయమ్మ తన ఇంటివద్ద సారా విక్రయిస్తుండగా ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె వద్ద ఉన్న 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇక్కడి నుంచి అక్కడికి..

నగరపాలక సంస్థ బదిలీల్లో వింత పోకడ

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

నగరంలో ప్రధానంగా నగరపాలక సంస్థ, రెవెన్యూ, రుడా, పోలీసు తదితర శాఖల్లో బదిలీలు వేగంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా నగరపాలక సంస్థ పరిధిలో ఇంజినీర్లు ఇప్పటికే బదిలీ అయ్యారు. వీరిలో కొంతమంది గడువు దాటకుండా బదిలీ జరగ్గా డీఈ, ఏఈ స్థాయిలో అయిదేళ్లపైబడి ఉన్నప్పటికీ బదిలీ కాకపోవడం విశేషం. వీరంతా తమ స్థాయిలో చక్రం తిప్పినట్లు తెలుస్తుంది. ఇక పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి బదిలీ ప్రక్రియ చర్చనీయాంశంగా మారుతోంది. ఈ విభాగంలో కీలక అధికారి రుడాకి బదిలీ కాగా అక్కడినుంచి అదే స్థాయిలో ఉన్న వ్యక్తి పట్టణ ప్రణాళికా విభాగానికి ముఖ్య అధికారి స్థాయిలో బదిలీ కావడం విశేషం. ప్రస్తుతం అదే అధికారిని నెల్లూరు బదిలీ చేసేందుకు అవకాశం ఉన్నప్పటికీ రుడాకు మొగ్గు చూపారు. గతంలో రుడా నుంచి వచ్చిన మహిళా అధికారి సైతం ప్రస్తుతం ప్రణాళికా విభాగంలో కీలకంగా ఉన్నారు. ప్రధాన ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా వాణిజ్య భవనాలకు అనుమతులు ఇచ్చిన సందర్భాల్లో వీరంతా కీలకంగా వ్యవహరించారు. గత ప్రభుత్వంలో ఇదే విభాగంలో పనిచేసిన అధికారి వివిధ ఆరోపణలతో రీజనల్ కార్యాలయానికి బదిలీ చేయడం జరిగింది. ప్రస్తుతం అదేవ్యక్తి మళ్లీ సిఫార్సులతో ఇక్కడికి పోస్టింగ్ సాధించారు. ఆయన మళ్లీ వస్తే గతంలో జరిగిన తప్పులు జరిగేందుకు ఆస్కారం ఉందనేది స్పష్టమవుతుంది. గత అయిదేళ్లలో రుడాలో అవినీతి ఆరోపణలు చోటుచేసుకున్నాయి. లేఅవుట్లు, భవన నిర్మాణాల అనుమతుకు అప్పటి అధికార పార్టీకి తొత్తులుగా పనిచేసిన అధికారులు సైతం మెల్లగా తప్పుకొనే ప్రయత్నంలో దాట వేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో కొంతమంది రాజకీయ నేతల అండతోనే చక్కబెట్టినట్లు తెలుస్తోంది.

> కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాధారణ బదిలీల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు నిబంధనల మేరకు దరఖాస్తు చేసేకొనేవిధంగా గడువు విధించింది. గత నెల రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగింది. ఎట్టకేలకు ఆయా శాఖల పరిధిలో బదిలీలకు సంబంధించి తాజాగా ఉత్తర్వులు విడుదలవుతున్నాయి.

ప్రజారోగ్య విభాగంలో..

నగరపాలక సంస్థ పబ్లిక్‌హెల్త్ విభాగంలో పలువురు ఇంజినీర్లు బదిలీ అయ్యారు. తాడేపల్లిలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేస్తోన్న ఈవీఎస్ ప్రసాద్‌ను రాజమహేంద్రవరం బదిలీ చేశారు. అదే విభాగంలో డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న జి.రవితేజను తాడేపల్లి పీహెచ్ విభాగానికి స్థానచలనం చేశారు. ఏపీటిడ్కో రాజమహేంద్రవరంలో డిప్యూటీ ఈఈగా ఉన్న షేక్ టి.ఆఫ్రిన్‌ను విజయవాడ బదిలీ చేయగా, అదే విభాగంలో కాకినాడలో డిప్యూటీ ఈఈగా ఉన్న పి.రాజును రాజమహేంద్రవరం పంపించారు. ఇక్కడ డిప్యూటీ ఈఈ ఉన్న డి.సత్యనారాయణ నిడదవోలు బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో డిప్యూటీ ఈఈగా ఉన్న డీఎస్ ప్రకాశరావును పెద్దాపురం పంపించారు. ఇక్కడ డిప్యూటీ ఈఈగా ఉన్న టి.చంద్రశేఖర్‌ను విజయవాడ బదిలీ చేశారు.

పౌష్టికాహారంపై విద్యార్థులకు పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐ బి.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బయట చిరుతిళ్లకు అలవాటు పడకుండా ఇంట్లో తయారు చేసిన వాటికే ప్రాధాన్యతివ్వాలన్నారు. జంక్‌ఫుడ్స్ తినడం వల్ల భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని డీఐ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, పి.బాపిరాజు, వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి సందడిలో మేనల్లుడి చేతివాటం

16 తులాల బంగారం, రూ.50 వేలు అపహరణ

పార్వతీపురం గ్రామీణం, పట్టణం, పురపాలిక, న్యూస్‌టుడే: పెళ్లి చూపుల కార్యక్రమంలో తోడుగా ఉంటాడని పిలిస్తే చేతివాటం ప్రదర్శించి అత్త కుటుంబాన్నే బురిడీ కొట్టించాడు ఓ మేనల్లుడు. ఇంట్లో భద్రపరిచి 16.72 తులాల బంగారం, రూ.50 వేలు నగదు నొక్కేశాడు. సంబంధిత వివరాలను పార్వతీపురం మన్యం ఏఎస్పీ అంకితా సురానా మంగళవారం వెల్లడించారు. పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లికి చెందిన కండి మణెమ్మ రేషన్ డీలరు. ఈమె కుమార్తెకు జులైలో పెళ్లి చూపులు జరిగాయి. తోడు కోసం రాజమహేంద్రవరంలో ఉంటున్న మేనల్లుడు డి.లక్ష్మణరావును పిలిచారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఇంట్లో ఎవరూ లేని సమయంలో నగలు, నగదు తీసుకొని లక్ష్మణరావు తిరిగి వెళ్లిపోయాడు. తర్వాత రోజు నగలు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి మేనల్లుడిపై మణెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గోవిందరావు, ఎస్‌ఐ దినకర్, పోలీసుల బృందం ఆయన గురించి ఆరా తీశారు. రాజమహేంద్రవరం లోనూ అతనిపై మూడు కేసులు ఉన్నట్లు తెలిసింది. మంగళవారం పెదబొండపల్లి వస్తున్నట్లు సమాచారం రావడంతో నర్సిపురం వద్ద కాపుకాసి లక్ష్మణరావును పట్టుకున్నారు. విచారణ చేపట్టగా తప్పును అంగీకరించాడు. నగదు ఖర్చు చేశానని, 16.72 తులాల బంగారు తిరిగి అప్పగించాడు. ఆయనను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని ఏఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐతో పాటు హెచ్‌సీ గౌరీశంకర్, సిబ్బంది శివ, కిశోర్, బాషా, నారాయణ, రామకృష్ణ, గోపాల్‌ను ఏఎస్పీ అభినందించారు.

విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి

దేవీచౌక్: విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావం కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల యూత్ రెడ్‌క్రాస్, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ అంకురిత దీక్షతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. యూత్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త డాక్టర్ మహాలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జేసీ చినరాముడు

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: నగరంలో తలపెట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. పుష్కరాల నేపథ్యంలో రోడ్ల విస్తరణకు నగరపాలక సంస్థ కార్యాచరణ అమలు చేస్తోంది. దీనిలో భాగంగా ముందుగా ఆక్రమణలపై దృష్టిసారించింది. రోడ్లు, కాలువలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను ప్రాధాన్యతా క్రమంలో కూల్చివేస్తోంది. మంగళవారం కోటిపల్లి బస్టాండ్‌ను ఆనుకొని ఉన్న ఆక్రమణలను తొలగించారు. తహసీల్దార్ కార్యాలయం ఆనుకొని ఉన్న నిర్మాణాలు, పోస్టాఫీసు వద్ద దుకాణాలతో పాటు డీలక్స్ సెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వైపు వచ్చే రహదారిని ఆనుకొని ఉన్న వ్యాపార దుకాణాలను తొలగించారు. ఆక్రమిత ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు సిటీప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి తెలిపారు.



కోటిపల్లి బస్టాండ్ వద్ద తొలగిస్తున్న ఆక్రమణలు

లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ జరపాలి

టి.నగర్, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ వివాదంపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. గిడుగు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలతో భక్తుల్లో ఆందోళన నెలకొందన్నారు. తిరుమలతో పాటు దేవాలయాల్లో అందించే ప్రసాదాల నాణ్యతను పరిశీలించాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తవుతున్నప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సిట్ విచారణపై తమకు నమ్మకం లేదన్నారు. సీబీఐ విచారణ జరిపించాల్సిన బాధ్యత ఎంపీ పురందేశ్వరిపై ఉందన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పీసీసీ సభ్యుడు బోడా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో పాల్గొన్న రుద్రరాజు, కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

వెలుగుబంద విద్యార్థినికి బహుమతి


నాగశ్రీకి జ్ఞాపిక అందజేస్తున్న అగ్నేశ్వరరావు

వెలుగుబంద, (రాజానగరం): ఐసీడీఎస్ రాజానగరం ప్రాజెక్ట్ వారు బాల్యవివాహం - నిర్మూలన అనే అంశంపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో వెలుగుబంద ఎంపీయూపీ పాఠశాల విద్యార్థిని భీష్మనాగశ్రీకి ద్వితీయస్థానం వచ్చిందని ప్రధానోపాధ్యాయుడు అగ్నేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం నాగశ్రీని ఉపాధ్యాయులు అభినందించారు.

నదులే నాగరికతకు నిలయాలు

బిక్కవోలు, న్యూస్‌టుడే: నదులే నాగరికతకు నిలయాలని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని కొంకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.యం శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులకు నదులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మన దేశంలో గంగ, యమున, కృష్ణ, గోదావరి వంటి నదులు ప్రవహిస్తున్నాయని, వాటిని భారతీయులు పవిత్రమైనవిగా పూజిస్తారని తెలిపారు. ఇంటరేక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా మన దేశంలో గల వివిధ నదులు వాటి జన్మ స్థలాలు గురించి, నదుల వల్ల భూములు సస్యశ్యామలంగా ఎలా మారాయో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు లక్ష్మణరెడ్డి వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పందులతో ఇబ్బందులు

సమస్య: అనపర్తి గ్రామ సచివాలయం-2 సమీపంలో విజయకృష్ణ అపార్ట్‌మెంట్స్‌కు వెళ్లే రహదారి ఎదురుగా చెత్త వేస్తున్నారు. దీంతో పందులు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో అక్కడ దుర్వాసన వస్తోంది. చర్యలు తీసుకోవాలి. **- స్థానికుడు, అనపర్తి**

సమాధానం: పందుల యజమానులకు నోటీసులు జారీ చేశాం, పందులను ఊరికి దూరంగా తరలించే ఏర్పాట్లు చేస్తాం.

- సాయికుమార్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, అనపర్తి

కాలువ పారడం లేదు

సమస్య: బొమ్మూరు నేతాజీనగర్ ఐదో వీధిలో కాలువ పారడం లేదు. ఇళ్ల వద్ద మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తుంది. **- శ్రీకాంత్, స్థానికుడు**

సమాధానం: సమస్యను పరిశీలించి కాలువ శుభ్రం చేయమని సిబ్బందిని ఆదేశిస్తాం. **- శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి, బొమ్మూరు**

– న్యూస్‌టుడే, బొమ్మూరు

సమస్య : రంగంపేట మెయిన్‌సెంటరులో మురుగు రోడ్డుపైకి చేరుతోంది. నిత్యం అధికంగా జనసంచారం ఉన్న ఈ సెంటరులో చాలాకాలంగా మురుగుతో చెడువాసనలు వెదజల్లుతున్నా పట్టించుకోవడం లేదు. **- రాజు, రంగంపేట**

సమాధానం : మురుగు కాలువ ఒక చోట పూడుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. కాలువను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తాం.

- సుబ్బారాయుడు, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, రంగంపేట

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

చెత్త తొలగాలి.. సంపద పెరగాలి

✦ కేంద్రాల పునఃప్రారంభానికి యత్నాలు

సీతానగరం, కొంతమూరు, న్యూస్‌టుడే: ఇంటింటా సేకరించిన చెత్త ద్వారా పారిశుద్ధ్యం మెరుగుపరచడంతోపాటు సేంద్రియ ఎరువులు తయారుచేసి పంచాయతీలకు ఆదాయం తేవాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన సంపద కేంద్రాలను వైకాపా ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదు. దీంతో చెత్త నిల్వకేంద్రాలు, సేంద్రియ ఎరువుల తయారీ తొట్లు వృథాగా మారాయి. పలు కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. గత తెదేపా ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం)లో భాగంగా సంపద సృష్టి కేంద్రాలను చేపట్టింది. ఒక్కో కేంద్రాన్ని ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు వెచ్చించి నిర్మాణం పూర్తిచేసింది. వీటిని వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసింది. పలు పంచాయతీల్లో అప్పట్లోనే వేతనాలు చెల్లించకపోవడంతో హరిత రాయబారులు (క్లాప్ మిత్రలు) మానివేశారు.


ముగ్గళ్ల చెత్త సంపద కేంద్రం దుస్థితి

నియోజకవర్గం	గ్రామ పంచాయతీలు	చెత్త సంపద కేంద్రాలు	హరిత రాయబారులు
రాజమహేంద్రవరం గ్రామీణం	21	19	211
రాజానగరం	71	54	215
అనపర్తి	41	34	221
గోకవరం(మండలం)	14	14	61

రెండు వారాల్లో సిద్ధమయ్యేనా..

అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి నాటికి అన్నిచోట్ల చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల పునఃప్రారంభానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి నుంచి వచ్చిన ఆదేశాలతో రాజమహేంద్రవరం గ్రామీణం, రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలతోపాటు గోకవరం మండలంలోని సంపద సృష్టి కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు.

109 కేంద్రాలు పనిచేసేలా..

డివిజన్ పరిధిలో మొత్తంగా 147 గ్రామపంచాయతీల్లో 121 సంపద సృష్టి కేంద్రాలు ఉంటే అందులో 109 కేంద్రాలు పనిచేసేలా ఉన్నాయని ఇప్పటికే అధికారులకు నివేదికలు చేరాయి. 808 క్లాప్ మిత్రలు అందుబాటులో ఉంటే అందులో 125 మందిని సంపద సృష్టి కేంద్రాల వద్ద నియామకం చేశారు. మిగిలిన కేంద్రాలన్నీ పాడైపోయి మరమ్మతులు చేసేలా అవసరమైన నిధులు పంచాయతీల నుంచి కేటాయించారు.

అన్నింటినీ ఉపయోగంలోకి తెస్తాం

అన్ని సంపద కేంద్రాలను అక్టోబరు 2 నాటికి సిద్ధం చేసేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాం. కొన్నిచోట్ల ముంపులో ఉన్న కేంద్రాలను వదిలేసి మిగిలిన అన్నింటిని తెరిపిస్తాం. సంపద సృష్టి కేంద్రాల్లో ఎరువు తయారీ వల్ల పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తోంది. క్లాప్‌మిత్రల పెండింగ్ జీతాల సమస్యను తీర్చడంతోపాటు చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి పెడతాం.

- దాసరి రాంబాబు, డీపీవో, రాజమహేంద్రవరం

వృత్తి విద్య విద్యార్థినులు పరిశ్రమ సందర్శన

అనపర్తి గ్రామీణం: సమగ్ర శిక్షా నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సులో భాగంగా అనపర్తి జడ్పీ బాలికోన్నత పాఠశాలకుచెందిన 60 మంది విద్యార్థినులకు మంగళవారం పరిశ్రమ క్షేత్ర సందర్శన నిర్వహించారు. టెక్స్‌టైల్స్, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు మగ్గం పనులు, అవసరమైన సాంకేతిక పరికరాలు, పనిముట్లు పని చేయు విధానాల గురించి ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్స్ నాగమని, సౌజన్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, త్రినాథ్, విజయప్రభ, నళిని, నూకరత్నం, బషీర్ బేగం, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి రికార్డుల పరిశీలన

రంగంపేట, న్యూస్‌టుడే : రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రాజమహేంద్రవరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు చెందిన టాస్క్‌ఫోర్సు బృందం సందర్శించింది. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య, అందిస్తున్న సేవల తీరు, రికార్డుల నిర్వహణను డీపీ హెచ్ఎన్‌వో వసంతలక్ష్మి, డీఎస్‌వో సీహెచ్.భాస్కర్, డీపీవో సంధ్యారాణి పరిశీలించి సూచనలు ఇచ్చారు. ముకుందవరంలోని సబ్‌సెంటరుని వారు సందర్శించి రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలు

అనపర్తి గ్రామీణం: ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా అనపర్తి జీబీఆర్ కళాశాల ప్రాంగణంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రతపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. విద్యార్థి దశలో సేవా దృక్పథం పెంపొందించుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అబ్బాయిరెడ్డి అన్నారు.


అనపర్తిలో కళాశాల ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న విద్యార్థులు

రాజానగరం: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎం.వి.ఎస్.బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటూనే ఎన్ఎస్ఎస్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ డా. ఎం.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.అవినాష్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మొక్కలు నాటారు.

● ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా గైట్ ఫార్మశీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పాతవెలుగుబంద ఎంపీయూపీ పాఠశాలలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ షేక్‌మీరా మాట్లాడుతూ పోషకాహారం వల్ల కలిగే లాభాలు, రక్తహీనతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి సూచించారు. వాలంటీర్ అఫ్రి మహ్మద్ విద్యార్థులతో పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

కడియం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. దుళ్లలో మంగళవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన ప్రగతిని వివరించారు. సచివాలయ సిబ్బంది కార్యాలయాలకు పరిమితం కాకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజావసరాలను తెలుసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మండలంలోని 27 డ్వాక్రా బృందాలకు రూ.4.15కోట్లు రుణాలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రత్నకుమార్, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, రఘురామ్, ముద్రగడ జమీ, చిట్టూరి అబ్బిరాజు, రాంబాబు, దేవినాగేశ్వరరావు, రామారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: హుకుంపేట పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడిచిందని, ఈ తక్కువ సమయంలోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఆక్రమణలకు గురైన కాలువలను గుర్తించి తొలగిస్తామన్నారు. కొత్తగా రోడ్లు, మురుగు కాలువలకు అంచనాలను సిద్ధం చేశామన్నారు. రైతులందరూ పశుసంవర్ధక శాఖ అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపీడీవో శ్రీనివాస్, దుద్దుపూడి రామకృష్ణ, బొప్పన నానాజీ, పెద్దాడ రామకృష్ణ, వల్లెపల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


దుళ్లలో డ్వాక్రా మహిళలకు రుణాల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

తహసీల్దారుగా శ్రీనివాసరావు

ధవళేశ్వరం: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సాధారణ బదిలీలలో రాజమహేంద్రవరం గ్రామీణ తహసీల్దారుగా సీహెచ్ శ్రీనివాసరావుని నియమిస్తూ జిల్లా కలెక్టరు ప్రశాంతి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు అల్లూరి జిల్లా గంగవరంలో తహసీల్దారుగా ఈయన పనిచేశారు. డిప్యూటీ తహసీల్దారుగా ఎస్.సూబ్బారావు, ఆర్ఐగా కె.వి ప్రసాదుని నియమించారు.

ఇళ్లు నిర్మించకపోవడంపై నిరసన

చక్రద్వారబంధం (రాజానగరం): చంద్రిక అవంతిక పేరుతో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నామంటూ రాకీ అవెన్యూస్ రియల్ ఎస్టేట్ సంస్థ తమ వద్ద నుంచి నగదు తీసుకుని ఏడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు పూర్తి చేయలేదని మండలంలోని చక్రద్వారబంధంలో మంగళవారం బాధితులు ఆందోళన చేశారు. బాధితులు మాట్లాడుతూ సుమారు 130 మంది ఫ్లాట్ల నిమిత్తం రాకీ అవెన్యూస్‌కు సొమ్ము చెల్లించామని, మూడేళ్ల కాలపరిమితిలో ఫ్లాట్లు నిర్మించి అప్పగించాలనేది నిబంధన అని తెలిపారు. సొమ్ములు చెల్లించిన కొంతకాలానికి సంస్థ ప్రకటించిన స్థలం వద్దకు వచ్చి చూడగా అవి అసంపూర్తిగా ఉన్నాయన్నారు. దీనిపై రాజమహేంద్రవరంలోని సంస్థ కార్యాలయంలో ప్రశ్నించగా త్వరలోనే ఫ్లాట్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. మరికొంత కాలం గడిచాక కార్యాలయానికి మరలా వెళ్లగా అక్కడ ఎవరూ లేరని సంస్థ బోర్డు తిప్పేసిందని, దాంతో తాము మోసపోయామని గ్రహించామన్నారు. గత ఏడాది ఈ విషయమై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఎం.మృత్యుంజయరావు, ఎం.కొండదేవ్, ఆర్.నాగలక్ష్మి సుధ, సహదేవ బిందు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న బాధితులు

ఎలుకల నివారణపై సూచనలు

కడియం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన పద్ధతులను ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ రైతులకు వివరించారు. కడియంలో ఎంఏవో ద్వారా కావేరి ఆధ్వర్యంలో ఆవ రైతులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. పంట అధిక దిగుబడికి పాటించాల్సిన సూత్రాలతో పాటు అధిక పురుగుమందుల వినియోగాన్ని నివారించాలని సూచించారు. మండల ఉద్యానశాఖ అధికారి సుధీర్, ఏఈవో గోపాలరావు, శంకర్, గారపాటి తాతాజీ, ఈశ్వరరావు, నాగేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

సామాజిక సేవలు అభినందనీయం

కడియం, న్యూస్‌టుడే: జనసైనికులు సామాజిక సేవలు అభినందనీయమని ప్రియదర్శినీ చెవిటి మూగ పాఠశాల నిర్వాహకులు కొనియాడారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి రత్నం అయ్యప్ప పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం చిన్నారుల మధ్య కేక్ కోసి వేడుకలు జరిపారు. కడియంలోని సీహెచ్‌సీలో బాలింతలకు, గర్భిణులకు రొట్టెలు, పండ్లు అందించారు. రాజమహేంద్రవరంలోని రక్తనిధికి వెళ్లి సుమారు 30 మంది మిత్రబృందం రక్తదానం చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల జనసైనికులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

జిల్లాస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక

బిక్కవోలు: పందలపాక జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 24 మంది విద్యార్థులు జిల్లాస్థాయి యోగా, చెస్, టెన్నికాయిట్, ఖోఖో, కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామోపాధ్యాయుడు యువరాజారెడ్డి తెలిపారు. ఇందులో 11 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. మండల, నియోజకవర్గ స్థాయిలోని ప్రతిభ కనబరచి వీరంతా జిల్లాకు ఎంపికయ్యారని తెలిపారు. బుధవారం నుంచి జిల్లా స్థాయిలో జరిగే క్రీడల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.


ఎంపికైన పందలపాక క్రీడాకారులు

అనపర్తి గ్రామీణం: అనపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ -14, 17 క్రీడా పోటీల్లో జీబీఆర్ పాఠశాలకు చెందిన 12 మంది ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు రామారావు మంగళవారం తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

మసీదుసెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కొత్తపల్లికి చెందిన ఎన్.కొండలరావు(66) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందారు. గడ్డిమందు తాగిన ఘటనలో అస్వస్థతకు గురికావడంతో జీజీహెచ్‌లో చేర్చారు. గోకవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఓ మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించిన ఘటన రాజమహేంద్రవరం మూడో పట్టణ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ అప్పారావు తెలిపిన వివరాల మేరకు.. కొంతమూరుకి చెందిన చింతలపూడి నూకరత్నం వై.జంక్షన్ వద్ద ఉన్న విద్యుత్తు ఉపకేంద్రంలో అటెండెర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం విధులు ముగించుకుని జయకృష్ణాపురం మీదుగా బిజిలీ ఐస్‌ఫ్యాక్టరీ రోడ్డువైపు వెళ్తున్న తరుణంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాహనం అదుపుతప్పి..

కొంతమూరు ప్రాంతానికి చెందిన ఎన్.రాజేంద్ర కోరుకొండ రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తరుణంలో వాహనం అదుపుతప్పి రోడ్డు విభాగినిని ఢీకొన్నాడు. ఆ క్రమంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాలు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సారా విక్రేత అరెస్టు

తాడితోట వీరభద్రనగర్‌కు చెందిన వి.జయమ్మ తన ఇంటివద్ద సారా విక్రయిస్తుండగా ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె వద్ద ఉన్న 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వంతెనపై గుంతతో అవస్థలు

కడియం నుంచి వీరవరం, దుళ్ల, పొట్టిలంక, ఆలమూరు మండలాలకు చేరే ప్రధాన వారధిగా ఉన్న పైవంతెనపై కాలినడక మార్గంలో సిమెంట్ బల్ల విరిగిపోయింది. దీంతో రాకపోకలకు ప్రమాదంగా మారిందని బాటసారులు వాపోతున్నారు. ఈ దారిలో పాఠశాలకు, కళాశాలకు విద్యార్థులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ ముందస్తు చర్యలుగా బారికేడ్‌ను అడ్డంగా పెట్టారు. శాశ్వత పరిష్కారానికి సంబంధిత అధికారులు చొరవచూపాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ సత్యనారాయణను వివరణ కోరగా గుంతకు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, కడియం**



రూ.3.85 లక్షల రికవరీకి ఆదేశాలు

గోకవరం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలు అవకతవకలను గుర్తించి సిబ్బంది నుంచి రూ.3.85 లక్షలు రికవరీకి అధికారులు ఆదేశించారు. డ్వామా ఏపీడీ బి.రాంప్రసాద్ ప్రిసైడింగ్ అధికారిగా ఎంపీపీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజావేదికను నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ.15.67 కోట్లు ఉపాధి హామీ కింద ఖర్చు చేశారు. ఈ పనుల తనిఖీల్లో తేడాలను గుర్తించి రికవరీకి ఆదేశించినట్లు ఎస్ఆర్‌పీ తులసీనాయక్ తెలిపారు. అంబుడ్స్‌పర్సన్ ఎస్.ఖాదర్‌బాషా, పీఆర్ జేఈ అబ్బాయిదొర, హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్, ఏపీవో అప్పలరాజు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

రాజవోలు, (బొమ్మూరు), న్యూస్‌టుడే: రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులను పాటించాలని ఏఈ భీమారావు అన్నారు. రాజవోలులో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంట దిగుబడి తగ్గడానికి గల కారణాలు తెలుసుకుని, సూక్ష్మపోషక లోపాలు గుర్తించి, భూసారం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశుసంవర్ధకశాఖాధికారి వెంకటరావు మాట్లాడుతూ పశువులకు సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. ఉద్యానశాఖ పథకాలు, ఏపీఎంఐపీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాలను ఉద్యాన సహాయకులు వివరించారు. రైతులు మంగళ, బుధవారల్లో జరిగే పొలం బడిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ పీటర్, వీఏఏ దుర్గబాబు, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

రాజానగరం: రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. నందరాడ, నరేంద్రపురంలలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన రైతులతో కలిసి పొలాలు పరిశీలించారు. గ్రామసభ నిర్వహించి పంటలకు నష్టం కలిగించే వివిధ రకాల తెగుళ్లు, వాటి నివారణ, సస్యరక్షణ గురించి వివరించారు. సాంకేతిక అధికారి శాంతాఆలీ, ఉద్యాన వన అధికారి దివ్యశ్రీ, మండల వ్యవసాయ అధికారి ఎస్.కె.ఇమామీఖాసిం, కేవీకే ఎస్ఎంఎస్ రఘునందన్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


కోరుకొండలో డ్రోన్ సహాయంతో పిచికారీపై అవగాహన

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేటలో మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు పంటలను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. వరిలో ఎండు తెగులు ఉద్ధృతిని గుర్తించి, నివారణోపాయాలను ఆయన వివరించారు. వాస్తవానికి వడిశలేరులో ఈ కార్యక్రమం ప్రారంభించాల్సి ఉండగా రైతు వైట్ల బుల్లిపండు పిడుగుపడి మృతి చెందడంతో రంగంపేటలో నిర్వహించారు.

అనపర్తి గ్రామీణం: అనపర్తి, అనపర్తి కొత్తూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన, ప్రకృతి వ్యవసాయ శాఖల అధికారులు రైతులతో సమావేశమయ్యి సూచనలు చేశారు.

కోరుకొండ: నరసాపురం గ్రామంలో ఏడీఏ మల్లికార్జునరావు, ఏవో గౌరీదేవి ఆధ్వర్యంలో డ్రోన్ సహాయంతో జీవామృతాన్ని పిచికారీ చేసి ఈ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు గురించి వివరించారు. ఉద్యాన అధికారిణి పి.రినీ, ఏఐఎఫ్ కె.హరీష్, ఎంపీటీసీ సభ్యుడు పీతా శ్రీనుబాబు, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అఖండ దీపంతో తిరుమలకు పాదయాత్ర

రాజానగరం, న్యూస్‌టుడే: భక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా శ్రీవేంకటేశ్వర స్వామి వారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించాడాన్ని నిరసిస్తూ, అఖండ దీపంతో తిరుమలకు పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నానని శ్రీ తారా వారాహి లోక కళ్యాణార్థ సేవా భారత్ ట్రస్టు ఫౌండర్, బచ్చు ఫౌండేషన్ ఛైర్మన్ బచ్చు అవినాష్ దేవి చంద్ర తెలిపారు. ఈ మేరకు తాను పిఠాపురంలో సోమవారం పాదయాత్ర ప్రారంభించానన్నారు. మంగళవారం రాత్రి రాజానగరం చేరుకుని అక్కడి నుంచి రాజమహేంద్రవరం బయలుదేరారు. ఇందులో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.


అఖండదీపంతో పాదయాత్ర చేస్తున్న అవినాష్

తొలిరోజే అనుబంధశాఖల డుమ్మా

బిక్కవోలు,న్యూస్‌టుడే: పొలం పిలుస్తోంది కార్యక్రమానికి బిక్కవోలు మండలంలో తొలిరేజే అనుబంధ శాఖల ఉద్యోలు, అధికారులు డుమ్మాకొట్టారు. వ్యవసాయశాఖతోపాటు పశుసంవర్ధక శాఖ సిబ్బంది తప్ప మిగిలిన శాఖల అధికారులు, సిబ్బంది రాలేదు. మొత్తం 14 శాఖల సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉంది. ఉద్యాన, మత్స్యశాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, బ్యాంకర్లు తదితరులు రావాలి. కేవలం వ్యవసాయశాఖ తరపున మాత్రమే హాజరై తంతు ముగించారు. వీరికి తోడు రెవెన్యూ, విద్యుత్, జలవనరుల శాఖ అధికారులు కూడా హాజరైతే తమ సందేహాలను తీర్చే అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడ్డారు. జలవనరుల శాఖ అధికారులైతే కార్యాలయంలో ఉండటం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ప్రశ్నిస్తే తాము కార్యాలయాని కంటే క్షేత్రస్థాయిలోనే పర్యటిస్తామని చెబుతున్నారని, ఏ క్షేత్రంలో పర్యటించారో కూడా అర్థం కాదని రైతులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ మూడు శాఖల అధికారులు కూడా పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరయ్యే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. తొలిసారిగా బిక్కవోలు, ఊలపల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏవో శామ్యూల్‌జాన్, ఇన్‌ఛార్జి ఎంపీపీ కన్నారావు, ఊలపల్లిలో ఎన్‌డీఏ నాయకులు సురేష్ కుమార్ రెడ్డి, సర్పంచి రమ్య తదితరులు పాల్గొన్నారు. ఊలపల్లిలో జరిగిన కార్యక్రమంలో రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు.


ఊలపల్లిలో ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కొవ్వూరు

అక్రమంగా నిల్వ చేసిన సిలిండర్లు స్వాధీనం

కొవ్వూరు పట్టణం: గృహ సిలిండర్లను పంపిణీ చేయకుండా అక్రమంగా నిల్వ చేసిన సిబ్బందిపై కేసు నమోదు చేశారు. పశివేదలలోని ఓ ఇంట్లో సిలిండర్లను ఉంచారన్న సమాచారంతో విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు బృందంగా దాడి చేయగా కొవ్వూరు లక్ష్మీగణపతి గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బోయ్ జి.దుర్గబాబు 14 సిలెండర్లు, వీవీఎస్ షుగర్స్ లిమిటెడ్‌లో పార్ట్‌టైం డెలివరీ బాయ్ జి.వెంకటరావు 7 గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసినట్లు తేలింది. వాటిని స్వాధీనం చేసుకుని బాధ్యులపై 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారి నాగ వెంకటరాజు, కిషోర్, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి వితరణ

ఉండ్రాజవరం: మండలంలోని సత్యవాడ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి పీవీ సుబ్బరాజు రూ.25 వేలు విలువైన మొక్కలను బడికి ఇచ్చారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నా చదువుకున్న పాఠశాలకు ఏదైనా చేయాలనే ఉద్దేశంతో మొక్కలు పంపిణీ చేశామన్నారు. ప్రధానోపాధ్యాయిని బి.సూర్యాకాంతం ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటారు.

గృహనిర్మాణ సంస్థ ఈఈగా చంద్రశేఖర్

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు గృహనిర్మాణ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా ఎస్.చంద్రశేఖర్ నియమితులయ్యారు. నిడదవోలు డీఈగా ఉన్న ఆయన కొన్నాళ్లుగా ఇన్‌ఛార్జి ఈఈగా బాధ్యతలు చూస్తున్నారు. తాజాగా పూర్తి స్థాయిలో ఆయనకు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

పలువురు తహసీల్దార్లు, డీటీలకు పోస్టింగ్

రాజమహేంద్రవరం కలెక్టరేట్: ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా జిల్లాకు కేటాయించిన, బదిలీ జరిగిన పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల(డీటీ)కు పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీచేశారు. కలెక్టరేట్ పరిపాలనాధికారిగా ఎం.డి.మక్బుల్ అలీని నియమించగా కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో కేఆర్‌సీసీ ప్రత్యేక తహసీల్దారుగా సి.హెచ్.విద్యావతిని, కొవ్వూరు తహసీల్దారుగా ఎం.దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక డీటీగా ఎ.సత్యనారాయణ, కొవ్వూరు డీటీగా ఎస్.వి.ఎస్.నాయుడు, ఎన్నికల డీటీగా కె.నిరంజన్, రీసర్వే డీటీగా కె.ఆనందకుమార్, పోలవరం ఐరిగేషన్ ప్రాజెక్టు ఆర్‌ఎస్ యూనిట్-1 ప్రత్యేక డీటీగా వి.వి.ఎల్.ప్రశాంతి, చాగల్లు డీటీగా టి.శ్రీనివాసరావు, రీసర్వే డీటీగా ఎం.కమల్ సుందర్, ఉండ్రాజవరం డీటీగా ఎ.వరకుమార్, పెరవలి డీటీగా కె.పద్మావతి, గోపాలపురం డీటీగా కె.అజయ్‌బాబు, రీసర్వే డీటీగా పి.వి.సాంబశివరావు, నల్లజర్ల డీటీగా వి.శాంతిప్రియ, రీసర్వే డీటీగా సి.హెచ్.ప్రభావసంతి, నిడదవోలు డీటీగా ఎస్.ప్రసాదరావు, రీసర్వే డీటీగా బి.ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు.

భాజపా బలోపేతానికి కృషి

నిడదవోలు: భాజపాను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని భాజపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాకి రాజు పేర్కొన్నారు. నిడదవోలులోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో మంగళవారం భాజపా నియోజకవర్గ సమన్వయకర్త బండి సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు మాట్లాడుతూ వచ్చే నెల 15 వరకు సభ్యత్వాల నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాలింగ శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి సత్యనారాయణ, భాజపా నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

నిడదవోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నిడదవోలు పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ పేర్కొన్నారు. నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలను మంగళవారం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆది నారాయణ ప్రారంభించారు. కోఆర్డినేటర్ ఎస్.నరసింహులు, ఎంఈవోలు కేవీవీ గణేష్, పి.గురుమూర్తి, ప్రధానోపాధ్యాయులు గురునాథం, వ్యాయామ ఉపాధ్యాయులు జోన్ డైసిరాంత్ పుల్లపురాజు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు పట్టణం: సామాజిక సేవా దృక్పథంతో చేపట్టే ప్రతి కార్యక్రమం మంచి ఫలితాలనిస్తుందని ఏబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వీ సుబ్బారావు అన్నారు. జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవాన్ని కొవ్వూరు ఏబీఎన్ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో వాలంటీర్లు మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించి స్వచ్ఛ సమాజ సాకారానికి సేవా పథకం తోడ్పడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి బి.సత్యనారాయణ, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

భార్య ఇంటికి రావట్లేదని భర్త ఆత్మహత్య

నిడదవోలు: విదేశాల్లో పనిచేస్తున్న భార్య ఇంటికి రావట్లేదనే మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక బసివిరెడ్డి పేటకు చెందిన దవాల సురేష్(42) తాపీ పని చేస్తుంటాడు. భార్య, ఇద్దరు పిల్లలు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఇంటర్ చదువుతున్నాడు. అతని భార్య ఉపాధి నిమిత్తం తొమ్మిదేళ్ల క్రితం దుబాయ్ వెళ్లారు. అప్పుడప్పుడు ఇక్కడకు వచ్చి వెళ్తుంటారు. ఆమెను తిరిగి వచ్చేయమని అడిగేవారు. కుటుంబ పోషణ కోసం ఆమె అక్కడే ఉండేవారు. మనస్తాపం చెందిన సురేష్ నిడదవోలు రైల్వేస్టేషన్ యార్డులో విశాఖపట్నం వైపు వెళ్లే రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీనిపై కేసు నమోదు చేశారు.

పల్లె సమస్యలకు.. కూటమి ప్రణాళికతో చెక్



గోపాలపురం: గుడ్డిగూడెంలో శిథిలావస్థలో సంపద కేంద్రం

– న్యూస్‌టుడే, గోపాలపురం, చాగల్లు, ఉండ్రాజవరం

గ్రామాల్లో వెలువడే చెత్తను సేకరించి తద్వారా సంపద సృష్టించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. చెత్త నిల్వ కోసం రూ.లక్షలతో నిర్మించిన షెడ్లు శిథిలం అయ్యాయి. పంచాయతీల ద్వారా చెత్త సేకరించి వాటి నుంచి సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయం తీసుకురావాలనేది అప్పటి తెదేపా ప్రభుత్వ లక్ష్యం. అప్పట్లో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా నిల్వ చేసేందుకు ప్రత్యేకంగా తొట్లు ఏర్పాటు చేశారు. నిత్యం గ్రామాల నుంచి చెత్త సేకరణ చేసి ఏర్పాటు చేసిన తొట్టెల్లో వాటిని నిల్వ చేసి, దాని ద్వారా వ్యవసాయానికి ఉపయోగ పడేలా కంపోస్టు తయారు చేసి అమ్మేవారు. అలా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేశారు. తోపుడు బండ్లు, రిక్షాల ద్వారా చెత్త సేకరణకు క్లాప్‌మిత్రలను అప్పటి తెదేపా ప్రభుత్వం నియమించింది. వైకాపా కాలంలో కన్నెత్తి చూడలేదు.

జూదరులకు, మందుబాబులకు అడ్డాగా..

ఈ కేంద్రాలు ఊరి శివారులో ఉండటంతో కొందరు ఆకతాయిలు జూదం ఆడేందుకు, మందు తాగేందుకు ఉపయోగిస్తున్నారు. రాత్రి సమయంలో మందుబాబులకు ఆవాసంగా మారుతున్నాయి. జూదరులకు అయితే రాత్రి, పగలు తేడా లేకుండా వాడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని, త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామని చెబుతున్నారు.

గత వైకాపా సర్కారు సమయంలో పంచాయతీలు పూర్తిగా పడకేశాయి. నిధులు లేక ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. కొత్తగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఆర్థిక సంఘం నిధులు కేటాయించడంతో పాటు పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, కాలువల్లో పూడికతీత, చెత్త సంపద కేంద్రాలు తదితర పనులు, వసతుల కల్పనపై దృష్టి సారించింది. ఈ మేరకు వందరోజుల ప్రణాళికను ప్రకటించి, జూన్ 15న కార్యాచరణ ప్రకటించారు. ఆయా అంశాలకు సంబంధించి శాఖల వారీగా మండల పరిషత్తు, తహసీల్దారు, ఆసుపత్రి, పాఠశాలలు ఇతర విభాగాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. నేటితో ప్రణాళిక పూర్తి అవుతుండగా, కార్యాచరణ కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు. పారిశుద్ధ్యం పరికరాలు, చెత్త తరలింపు వాహనాలు కీలకం. ఈ క్రమంలో మూడు నియోజకవర్గాల్లోని తొమ్మిది మండలాల్లో 153 గ్రామాల్లో ఎన్ని వాహనాలు, పరికరాలు వినియోగంలో ఉన్నాయి. ఎన్ని మరమ్మతులకు గురయ్యాయో గుర్తిస్తున్నారు. ఎస్‌బీఎం నిధుల నుంచి సరఫరా చేసిన ట్రాక్టర్లు, రిక్షాలు, హైప్రెజర్ క్లీనర్లు, చెత్త డబ్బాలు, తదితర సామగ్రిని గుర్తిస్తున్నారు. ఇంకా ఎన్ని కావాలో లెక్కిస్తున్నారు. దీనిపై డీఎల్‌పీవో అమ్మాజీ మాట్లాడుతూ లక్ష్యం పూర్తిస్థాయిలో అమలయ్యేలా కృషి చేస్తున్నామన్నారు. సిబ్బందికి శిక్షణ పూర్తయ్యిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెళ్తున్నామన్నారు.



కేంద్రాల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న కార్యదర్శి



అండర్-14 బాలబాలికల జట్లతో ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

గోపాలపురం: చదువుతో పాటు క్రీడలు అవసరమని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యులు కె.లలిత పేర్కొన్నారు. స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో సెపక్‌తక్రా ఎంపిక పోటీలు గోపాలపురం మండలం వాడాలకుంట ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగాయి. పోటీలను ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచి జొన్నకూటి మణెమ్మలు ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది పాల్గొన్నారు. 20 మంది వ్యాయామోపాధ్యాయులు పర్యవేక్షించారు. చిన్న వల్లెటూరిలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడానికి సహకరించిన గ్రామస్థులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఖండవల్లి నాగలక్ష్మి, తెదేపా నాయకులు వడ్లమూడి రమేష్, జ్యేష్ఠ శ్రీనివాసరావు, కాకర్ల శ్రీరామ్, మాజీ సర్పంచి కొడమంచిలి విద్యాసాగర్, మోహన్, చిడిపి శ్రీను, రవిశేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు ఏడీఈగా కృష్ణనాయక్

కొవ్వూరు పట్టణం: విద్యుత్తు సరఫరా ప్రక్రియ పారదర్శకంగా కొనసాగించి వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని కొవ్వూరు సబ్ డివిజన్ విద్యుత్తు అదనపు డివిజనల్ ఇంజినీరు(ఏడీఈ) ఎం.కృష్ణనాయక్ అన్నారు. కొవ్వూరు ఏడీఈగా మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బొమ్మూరులో హెచ్చెల్ మీటర్ల విభాగం డీఈఈగా పనిచేసిన ఆయన బదిలీపై కొవ్వూరు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన బి.ఉదయభాస్కరరావు అమలాపురం డీఈఈగా బదిలీ అయ్యారు.



ఏడీఈకి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

శివానంద వాకర్స్‌క్లబ్ విరాళం

కొవ్వూరు పట్టణం: విజయవాడ వరద బాధితుల ఆపన్న హస్తం అందించేందుకు చొరవ చూపుతున్న చొరవ చూపి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు శివానంద మార్నింగ్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.25 వేలు విలువైన చెక్కును మంగళవారం అందజేశారు. శివానంద పురపాలక ఉద్యానవనంలో కార్యక్రమం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు పేరాబత్తిన శివప్రసాద్, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, క్లబ్ ప్రతినిధులు యాగంటి చలపతి, మద్దిపాటి సత్యనారాయణ, పరిమి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు చెక్కు అందిస్తున్న ప్రతినిధులు

ఈఈగా నారాయణ అప్పారావు



నిడదవోలు: ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు డివిజన్ ఈఈగా ఎన్.నారాయణ అప్పారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు డివిజన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన బి.వీరభద్రరావు జంగారెడ్డిగూడెం బదిలీ అయ్యారు. నారాయణ అప్పారావు గతంలో నిడదవోలు ఏడీఈగా పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంవీఐగా శివప్రసాద్





కె.వి.శివప్రసాద్ వి.లక్ష్మీప్రవీణ

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రవాణా శాఖ నిబంధనలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని, ఆ మార్గదర్శకాలు జీవన విధానం కావాలని ఎంవీఐ కె.వి.శివప్రసాద్ సూచించారు. కొవ్వూరు ఎంవీఐగా ఆయన, ఏఎంవీఐగా వి.లక్ష్మీప్రవీణ బాధ్యతలు స్వీకరించారు. జంగారెడ్డిగూడెంలో ఇదే స్థానంలో విధులు నిర్వర్తించిన వారిద్దరూ బదిలీపై కొవ్వూరు వచ్చారు. మంగళవారం ఉదయం కార్యాలయంలో ఎంవీఐ మాట్లాడుతూ ప్రజా ప్రాణ రక్షణకే ప్రభుత్వం నిబంధనలను నిర్దేశించిందన్నారు. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో రవాణా శాఖ పరంగా పారదర్శకంగా సేవలందిస్తామన్నారు. యువత కచ్చితంగా లైసెన్సులు తీసుకోవాలన్నారు. శిరస్త్రాణం ధరించాలన్నారు.

ఏపీఎంగా రామకృష్ణ

పెరవలి: పెరవలి ఏపీఎంగా రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన నాగరాజు బదిలీపై పెంటపాడు వెళ్లారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



చాగల్లులోని తాగునీటి ట్యాంకు కట్టి సుమారు 50 ఏళ్లు దాటింది. 1.5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ ట్యాంకు ద్వారా దాదాపు 3,000 మందికి తాగునీరు సరఫరా చేస్తారు. అలాంటి ట్యాంకు పెచ్చులూడి అధ్వానంగా మారింది. బాగుచేయాలని గ్రామస్థులు ఎంత వేడుకున్నా గత పాలకులు పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే దీనికి మరమ్మతులు చేయాలని భావించారు. పంచాయతీ నిధులు సుమారు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు చేసినా, ఖర్చు పెరిగే అవకాశం ఉండడంతో రూ.15లక్షలతో మరో అంచనా తయారు చేసి, ఉన్నతాధికారులకు నివేదించారు. పనులు ప్రారంభించారు. దీనిపై కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ మరమ్మతులు జరుగుతున్న సమయంలో ట్యాంకు నుంచి కాకుండా బోర్ల నుంచి పైపుల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. **- న్యూస్‌టుడే, చాగల్లు**

పడుతూ.. లేస్తూ..



ఆవపాడు శివారులోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో బీటీ రహదారి మధ్యలో గుంత ఏర్పడింది. ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు గుంతలో నీరు చేరడంతో రహదారి ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. ఇటీవల తాడేపల్లిగూడెంనకు చెందిన దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తూ అందులో పడి గాయాలపాలయ్యారు. దీనిపై ర.భ.శాఖ అధికారులకు వివరించినా పట్టించుకోవట్లేదని స్థానికులు వాపోతున్నారు. సర్పంచి అచ్యుత సత్యనారాయణను సంప్రదించగా రహదారిపై గుంత పూడ్చుతామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. **- న్యూస్‌టుడే, నల్లజర్ల**

వృథా.. వ్యథ



దేవరపల్లి మండలం అచ్చియ్యపాలెం-బుచ్చియ్యపాలెం వెళ్లే రహదారిలో ట్యాంకుల అంచుల నుంచి నీరు కారుతోంది. చిన్న ట్యాంకులోకి రెండు మోటర్ల నీరు వెళ్లి అక్కడ నుంచి మరో రెండు పెద్ద ట్యాంకుల్లోకి తాగునీరు పంపింగ్ జరుగుతుంది. నీరు నియంత్రించే విధంగా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కువగా వృథా అవుతుంది. నాచు పట్టింది. మరో వైపు ప్రజలు ప్రజలు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్‌ను వివరణ కోరగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి ఆరు అంగుళాల గేట్‌వాల్ ఏర్పాటు చేసి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, దేవరపల్లి**

తీగలు తెగి.. చీకట్లు అలముకుని



తాళ్లపూడి మండలంలోని వేగేశ్వరపురం గోదావరి తీరానికి వెళ్లే రహదారిలో భారీ వర్షం ఈదురుగాలల కారణంగా విద్యుత్తు తీగలు తెగి పడ్డాయి. సరిచేయకపోవడంతో దీపాలు వెలగక ఆ మార్గంలో అంధకారం నెలకొంది. దీనికి తోడు ఎప్పట్నించో వెలగని కొన్ని దీపాలు అలంకార ప్రాయంగా ఉన్నాయి. రాత్రి రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఏఈ వెంకట్రావుతో మాట్లాడగా తక్షణమే తీగలు సరిచేసేలా దృష్టి సారిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, తాళ్లపూడి**

రక్షణ నిడదవోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో ప్రజల ఆస్తుల భద్రతకు భరోసా దక్కిందని తెదేపా నిడదవోలు పట్టణ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 24వ వార్డులో ప్రచారం చేశారు. పట్టణ ప్రధాన కార్యదర్శి టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రమదానం నిడదవోలు: ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా భాజపా సీనియర్ నాయకులు రంగా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిడదవోలు సామాజికాసుపత్రిలో మంగళవారం మొక్కలు నాటారు. బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, అడపా రామకృష్ణ, సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోరాటం కొవ్వూరు పట్టణం: ప్రజా పక్షాన సమస్యలపై వైకాపా పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు జన్మదిన వేడుక, సత్యవతినగర్‌లో నూతన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో వెంకట్రావు కేకు కోశారు. వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ వైకాపాకు పూర్వవైభవం తెచ్చేందుకు శ్రేణులు సన్నద్ధం కావాలన్నారు. యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సంక్షేమమే పార్టీ ధ్యేయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, రుత్తల ఉదయ భాస్కరరావు, సుంకర సత్యనారాయణ, కంఠమణి రమేష్, గంధం సాయి పాల్గొన్నారు.

కృషి దేవరపల్లి: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించి మూడేళ్లు పూర్తవ్వడంతో మంగళవారం ప్రజాప్రతినిధులతో కేకు కోసి వేడుకలు జరిపారు. ఎంపీపీ మాట్లాడుతూ రూ.7.14 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. రాబోయే రెండేళ్లు ఎంపీ, ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నరహరిశెట్టి రాజేంద్రబాబు, కవల శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సర్పంచి కడిమి వీరకుమారి, పి.రామ్‌గోపాల్, కె.సతీష్, డి.గంగాధర్, ఎ.అనసూయ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

మసీదు సెంటర్(కాకినాడ): కొవ్వూరు మండలం అన్నదేవరపేటకు చెందిన సీహెచ్ పోసిబాబు(40) కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆవు దాడి చేసిన ఘటనలో తీవ్రంగా గాయపడటంతో ఈ నెల 22న జీజీహెచ్‌లో చేర్చారు. కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యం

ఉండ్రాజవరం: బాలిక అదృశ్యంపై కేసు నమోదైంది. ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సూర్యారావుపాలెంనకు చెందిన 17 ఏళ్ల బాలిక సోమవారం అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. వెతికినా కనిపించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జూద స్థావరంపై దాడి

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడెం శివారులో ఒక తోటలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు దాడి చేశారు. రూ.18,710 స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు.

ప్రతిభకు సత్కారం



నిడదవోలు: విద్యారంగ అభివృద్ధికి డాక్టర్ న్యూటన్‌పాండు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాజమహేంద్రవరం కమాండర్ కొండా నరసింహారావు పేర్కొన్నారు. ఫిలాన్‌త్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ఎక్సలెన్స్ జాతీయ అవార్డులు అందిస్తారు. తాడిమళ్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ విప్పర్తి ఐజాక్ న్యూటన్ పాండు సేవలను గుర్తించి కమాండర్ నరసింహారావు చేతులమీదుగా మంగళవారం అందించారు. సంస్థ ఛైర్మన్ అద్దంకి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూటన్‌పాండును ప్రధానోపాధ్యాయుడు వి.సూర్యనారాయణశాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

నిడదవోలు: సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎస్‌వీడీ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.ఉషారాణి అన్నారు. నిడదవోలు వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కంబయ్య, అధ్యాపకులు డి.లావణ్య, పీవీఎల్ నారాయణ, జె.శోభారాణి, కె.జానకీదేవి, సరోజిన, శ్రీదేవి, ఇందిర, సోని తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రధానాచార్యురాలు బి.మేరీసుజాత చేతుల మీదుగా బహుమతులు అందించారు.

'అంబేడ్కర్ ఫ్లెక్సీ తొలగించడం తగదు'

నల్లజర్ల: ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు.. అంబేడ్కర్ ఫ్లెక్సీ తొలగించడం హేయమైన చర్య అని మండల వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. కాకినాడ గ్రామీణం ఎమ్మెల్యే పంతం నానాజీ వైద్యుడిని దుర్భాషలాడడం సరికాదన్నారు. మంగళవారం ఘంటావారిగూడెంలో ఒకరోజు దీక్ష చేపట్టారు. కోర్ కమిటీ సభ్యులు పిల్లి కాంతారావు, గుదే వెంకట సుబ్బారావులు మాట్లాడుతూ ఆ ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలన్నారు. దొబ్బిడి శ్రీను, వడ్డి శ్రీను, కూరపాటి శ్రీను, తోట రాము, ఈడే నిర్మల, రాణి తదితరులు పాల్గొన్నారు.

వినూత్న విధానాలు తీసుకొద్దాం: ఎమ్మెల్యే వెంకటరాజు



కార్యక్రమంలో ఎమ్మెల్యే తదితరులు

నల్లజర్ల: వ్యవసాయంలో వినూత్న పద్ధతులు తీసుకొద్దామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పిలుపునిచ్చారు. మంగళవారం నియోజకవర్గ స్థాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని అనంతపల్లిలో నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకటరాజు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయంతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, ఉద్యాన, పశువర్ధక శాఖ సిబ్బంది రైతులు దగ్గరకు వెళ్లడం, పథకాలు వివరించడం, వ్యవసాయ ఆధునిక, సాంకేతిక, సమాచార పరిజ్ఞానం తెలియజేయాలన్నారు. త్రీఎఫ్ ఆయిల్‌పాం సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను పరిశీలించారు. ఏవో కమల్‌రాజ్, మండల ఉద్యానశాఖాధికారిణి బబిత, యలమాటి శ్రీను, పసుమర్తి రతీశ్, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సూచించారు. పెరవలి మండలం కాకరపర్రులో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇందులో భాగంగా మట్టి నమూనాల కార్డులను రైతులకు ఇస్తున్నామన్నారు. దాన్ని ఆధారం చేసుకుని ఎరువులు వాడాలన్నారు. మంగళ, బుధ వారాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని 367 గ్రామాల్లో ప్రస్తుతం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి సత్యకుమారి, జిల్లా ప్రాజెక్టు అధికారి బి.తాతారావు, సీనియర్ పరిశోధకులు కె.రవీంద్రకుమార్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.